# మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట


## అమ్మ... నేనేమి పాపం చేశాను...

**- నీ కడుపున పుట్టడమే శాపమా.?**

**- అప్పుడే పుట్టిన పసికందును చెత్తకుప్పలో పడేసిన కసాయి తల్లి**



ముళ్ల కంపలో పడేసిన పసికందు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 13 ప్రభాతవార్త:** నవమాసాలు మోసి పేగు తెంచుకొని జన్మనిచ్చిన కన్నబిడ్డనే కర్కషంతో చెత్తకుప్పలో పడేసి వెల్లిపోయిన అభాగ్యురాలు ఆ తల్లి. ప్రేమ, మమకారంతో అల్లారుముద్దుగా పెంచుకోవాల్సిన కన్నబిడ్డను కళ్ల ముందే ముళ్ల కంపలో పడేసేంతా బాధ ఆ తల్లికి ఎందుకొచ్చిందో. కట్టుకున్నవాడు కాదన్నడా, పుట్టిన బిడ్డ అమ్మ నన్ను వదిలేయమని అడిగాడో కానీ ఆ తల్లి ఏ మాత్రం కనీకరం లేకుండా ముళ్ల కంపలో పుట్టిన క్షణాల్లోనే పడేసంతా ఆ పసికూన ఏ పాపం చేశాడు.

నాగర్‌కర్నూల్ జిల్లా తెల్కపల్లి మండలం తాళ్లపల్లి గ్రామంలో అప్పుడే పుట్టిన పసికందున ముళ్లకంపలో పడేసిన హృదయవిదారక సంఘటన శనివారం చోటు చేసుకుంది. గ్రామ సర్పంచ్ భాస్కర్‌గౌడ్ అందించిన వివరాల ప్రకారం. మండల పరిధిలోని తాళ్లపల్లి గ్రామంలో శనివారం ఉదయం ప్రసవించిన గుర్తు తెలియని కసాయి తల్లి కండ్లు కూడా తెరువని పసికందును గ్రామంలోని హరిజనవాడలోని మామిళ్లపల్లి సాయిలు ఇంటి సమీపంలో చెత్త కుప్పలో పడేయడంతో గుర్తించిన గ్రామస్తులు సర్పంచ్‌కు సమాచారమివ్వడంతో అక్కడికి వెళ్లి కళ్లు తెరువని పసికందును చేరదీసి ఆ పసికందుకు సపర్యాలు చేసి సంబంధిత జిల్లా అధికారులకు, పోలీస్ అధికారులకు సమాచారమందించినట్లు సర్పంచ్ తెలిపారు. విషయం తెలుసుకున్న అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని పసికందును శిశువిహార్‌కు తరలించారు.

## రెండు పార్లమెంట్ స్థానాలు గెలుస్తాం..

**గత ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేసింది**

**ప్రాజెక్టుల్లో పెద్ద ఎత్తున అవినీతి**

**కాంగ్రెస్ ప్రభుత్వం తప్ప కారు గ్యారంటీలను అమలు చేస్తుంది**

**మీడియా సమావేశంలో దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి**

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 13 ప్రభాతవార్త :** రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని రెండు పార్లమెంట్ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని రెండు పార్లమెంట్ స్థానాలను కాంగ్రెస్ తప్పక గెలుస్తుందని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మహబూబ్‌నగర్‌జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో తాము చెప్పినట్లుగానే ఉమ్మడి పాలమూరు జిల్లాలోని 14 స్థానాల్లో 12 స్థానాలు గెలిచామని, రెండు స్థానాలు కూడా గెలవాల్సి ఉండేదని చెప్పారు. గత ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేసిందని అందుకే రాష్ట్ర ప్రభుత్వ అప్పులపై శ్వేతపత్రం విడుదల చేయాల్సి వచ్చిందని గుర్తు చేశారు. ప్రాజెక్టుల్లో వ్యవసాయ రంగంలో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలు అమలు చేయవద్దని చేస్తున్న దుష్ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని చెప్పారు. 100 రోజుల్లో 6 గ్యారంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం తప్పక అమలు చేస్తుందని పేర్కొన్నారు. కాళేశ్వరం లాంటి ప్రాజెక్టులో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని దానిపై విచారణ జరపనున్నట్లు వెల్లడించారు. స్థానికంగా కొనసాగుతున్న పాలమూరు రంగారెడ్డిలోని కరివెన ప్రాజెక్టులో దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే నల్లమట్టి తరలిస్తూ పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. చట్ట పరంగా విచారణ కొనసాగించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో టిపిసిసి నాయకులు వినోద్‌కుమార్, మీడియా కన్వీనర్ బెనహర్ పాల్గొన్నారు.



## కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య...

**-ఆగ్రహంతో భర్తను చితకబాది చంపిన బంధువులు**



సింధు ఫైల్



నాగర్జున (ఫైల్)

**అచ్చంపేట/లింగాల, జనవరి 13 ప్రభాతవార్త:** కుటుంబ కలహాలు, వేధింపుల కారణంగా ఓ వివాహిత ఆత్మహత్య చేసుకోగా, ఆమె భర్తను చితకబది హతమార్చిన సంఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు.. లింగాల మండలం చెన్నంపల్లి గ్రామానికి చెందిన సింధు (26) అచ్చంపేటలో శ్రీరామ్ సరియన్ ఆసుపత్రిలో పనిచేస్తున్న ఖమ్మం జిల్లాకు చెందిన నాగర్జున (30)తో పరిచయం ఏర్పడింది. 3సంవత్సరాల క్రితం ఇరువురు ప్రేమవివాహం చేసుకొని అచ్చంపేటలో నివాసం ఉంటుందన్నారు. కొంత కాలం పాటు సవ్యంగా సాగిన వీరి వైవాహిక జీవితంలో గొడవలు ప్రారంభమయ్యాయి. ఈ తరుణంలో శుక్రవారం రాత్రి సింధు తన ఇంట్లో ఊరివేసుకొని ఆత్మహత్యయత్నానికి ప్రయత్నించింది. కొన ఊపిరితో ఉన్న ఆమెను అచ్చంపేట పట్టణంలోని శ్రీరామ్ సరియన్ ఆసుపత్రిలో డాక్టర్ కృష్ణ ప్రథమ చికిత్స నిర్వహించి పరిస్థితి విషమంగా ఉండటంతో నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రికి తరలించగా... పరిస్థితి మరింత విషమంగా మారడంతో హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో సింధు మృతి చెందినది. సింధు మృతి చెందడంతో ఆమె కుటుంబ సభ్యులు భర్త నాగర్జునను వాహనంలో ఎక్కించుకొని వాహనంలోనే చితకబాదడంతో రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు సమీపంలో మృతి చెందినట్లు పోలీసులు గుర్తించారు. తమ కూతురు ఆత్మహత్యకు గత కొన్ని సంవత్సరాలుగా అండగా నిలిచిన డాక్టర్ కృష్ణ, అతని భార్య కారణమని మృతురాలి తల్లి ఆరోపించారు. ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ గోవర్ధన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## చిరుత మృత్యువాత..

## అనారోగ్యమా ఇతర కారణాలా...?

**నారాయణపేటలో సెల్ఫీలు దిగిన యువకులు**



**నారాయణపేట ప్రతినిధి, జనవరి 13 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా కంసానిపల్లి ప్రాంతంలో మూడు చిరుతలు సంచరించినట్లు స్థానికులు గుర్తించారు. శనివారం ఉదయం నుంచి పలు ప్రాంతాల్లో రెండు మూడు చిరుతల సంచారం జరగడంతో గమనించిన గ్రామస్తులు వెళ్లి చూసేందుకు ప్రయత్నించారు. అయితే ఒక చిరుతకు గాయాలపాలు కావడంతో అస్వస్థత వల్లనో వేగంగా ముందుకు - మిగతా4లో..

## క్రీడల్లో గెలుపోటములు సమానంగా స్వీకరించాలి..



కబడ్డీ పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే

**అలంపూర్ జనవరి 13 ప్రభాతవార్త:** క్రీడల్లో గెలుపోటములను సహజమని క్రీడాకారులు వాటిని సమానంగా స్వీకరించాలని అలంపూరు ఎమ్మెల్యే విజయుడు అన్నారు. శనివారం జోగులాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండల పరిధిలోని పుల్లూరు గ్రామంలో సంక్రాంతిని పురస్కరించుకుని తెలుగు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను ఎమ్మెల్యే విజయుడు, సీనియర్ నాయకులు చల్లా గిరిధర్ రెడ్డి, ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో క్రీడలు నిర్వహించడం అభినందనీయమని ఈ సంక్రాంతికి నియోజకవర్గ ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు. అదే విధంగా గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరు ఐక్యతతో భాగస్వాములు కావాలని కోరారు. ఎమ్మెల్యే వెంట బిఆర్ఎస్ నాయ కులు కలుగొట్ల పీఏసిఎస్ అధ్యక్షులు ఉయ్యాలవాడ గజేందర్ రెడ్డి, నాయకులు పరమేశ్వర్ రెడ్డి, కరుణ సింహ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, గోపాల్ తదితరులు ఉన్నారు.

# ఈకేవైసీ ఇన్సూరెన్స్ సాకుతో అక్రమ దందా..!

**-రూ.200లు వసూలు చేస్తున్న గ్యాస్ ఏజేన్సీ -బలవంతపు వసూళ్లతో లబోదిబోమంటున్న లబ్ధిదారులు**





శ్రీ సాయి అమృత ఇండియన్ గ్యాస్ ఏజేన్సీ



M/s. SRI SAI AMRUTHA INDANE GRAMIN VITRAK

Ph: 08549-274914 Cell : 9490589694

డబ్బులు వసూలు చేసి లబ్ధిదారులకు అందిస్తున్న రసీదు

**వంగూరు, జనవరి13 ప్రభాతవార్త:** ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన 6 గ్యారెంటీ పథకాల్లో ఒక్కటైన గ్యాస్ సిలిండర్ పథకానికి అర్హులు కావాలంటే ఈకేవైసీ, ఇన్సూరెన్స్ చేయిస్తేనే రూ.500లకే గ్యాస్ సిలిండర్ వస్తుందనే పుకార్లు లేపుతూ ఏజేన్సీ యాజమాన్యం తమ జేబులను నింపుకునేందుకు అమాయకమైన పేద ప్రజల నుంచి అక్రమంగా తమ ఏజేన్సీలో ఉన్న వస్తువులను కొనుగోలు చేయాలంటూ, ఇన్సూరెన్స్ చేయాలంటూ బలవంతంగా డబ్బులు వసూలు చేస్తున్న వైనం వంగూరు మండల కేంద్రంలో శ్రీసాయి అమృత ఇండియన్‌గ్యాస్ ఏజేన్సీలో చోటు చేసుకుంది. రాష్ట్ర ప్రభుత్వం రూ.500ల కు అందిస్తున్న సిలిండర్‌లకు సంబంధం లేకపోయిన ఏజేన్సీలు మాత్రం తమ సంపాదనను పెంచుకునేందుకు నయా దందాకు తెరలేపారు. రెక్కాడితే కానీ డొక్కాడని పేద ప్రజలకు ప్రభుత్వం అండగా నిలిచి ప్రజలను ఆదుకునేందుకు ముందుకు వస్తుంటే గ్యాస్ ఏజేన్సీ నిర్వాహకులు మాత్రం ప్రజలపై గుదిబండ మోపుతున్నారు. వంగూరు మండల కేంద్రంలోని శ్రీ సాయి అమృత ఇండియన్ గ్యాస్ ఏజేన్సీ సిబ్బంది ఈకేవైసీ, ఇన్సూరెన్స్ చేయాలంటూ లబ్ధిదారులను ఇబ్బందులకు గురి చేస్తూ కొర్రిలు పెడుతున్నారని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో లబ్ధిదారుడి నుంచి రూ.200లు వసూలు చేస్తూ గ్యాస్ లైటర్ లేదా ఇన్సూరెన్స్ చేయించుకోవాలని ఇబ్బందులకు గురి చేస్తున్నారని పలువురు లబ్ధిదారులు వాపోతున్నారు. ఇంట్లో లైటర్ ఉన్నప్పటికి ఖచ్చితంగా తీసుకోవాలనే అంక్షలు విధించడంతో మాకు వద్దని చెప్పిన వినకుండా తీసుకోవాల్సిందేనని, లేదంటే ఈకైవైసీ కాదని లేకపోతే ఇన్సూరెన్సైనా చేయాలని ఇబ్బందులకు గురి చేస్తున్నారని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం వంగూరు మండలంలోని మిట్టసదగోడు, గాజర, ఉమ్మాపూర్ గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో శ్రీ సాయి అమృత ఇండియన్ గ్యాస్ ఏజేన్సీసిబ్బంది గ్రామంలోని లబ్ధిదారుల వద్దకు వెళ్లి ఇన్సూరెన్స్ చేయించుకోవాలని ఇబ్బందులకు గురి చేస్తూ రూ.200లు వసూళ్లకు పాల్పడ్డారు. గ్రామానికి చెందిన కొంత మంది లబ్ధిదారులు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. డీటీ వెంకటరమణ సంబంధిత సిబ్బందికి బలవంతపు వసూళ్లు చేయకూడదని, అక్కడి నుంచి వెళ్లిపోవాలని సూచించడంతో సిబ్బంది వెనుతిరిగారు. ఇది ఇలా ఉంటే ప్రభుత్వ నిబంధనల ప్రకారంగా గ్యాస్ గోదామ్ నుంచి సుమారు 18 కిలో మీటర్ల లోపు ఉన్న గ్రామాల్లో సిలిండర్లు డెలివరీ చేస్తే డెలివరీ చార్జ్ తీసుకోవద్దనే నిబంధనలు ఉన్నప్పటికి ఆ ఏజేన్సీ నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి ఒక్క సిలిండర్ డెలీవరి చేస్తే రూ.30ల చొప్పున వసూలు చేస్తూ పబ్బం గడుపుతున్నారు. ఇంత జరుగుతున్న కూడా ఆ ఏజేన్సీపై ఎలాంటి చర్యలు లేకపోవడం శోచనీయంగా మారింది. ఉన్నతాధికారుల నిర్లక్ష్యమో, నిర్వాహకుల పలుకుబడో కానీ ఏజేన్సీపై ఎలాంటి చర్యలు లేకపోవడానికి నిదర్శనం.

**ఈ రోజు రాకుంటే నీ ఇన్సూరెన్స్ చెల్లదు.**

**-చింతకుంట్ల సైదులు గాజర**



ఇన్సూరెన్స్, ఈకేవైసీ పేరుతో గ్యాస్ వినియోగదారుల వద్దకు వెళ్తున్న ఏజేన్సీ సిబ్బంది గ్యాస్ సిలిండర్ ఒకరి పేరుపై ఉన్న ఆ ఇంట్లో ఎవరైన సరే ఫోటో దిగితే సరిపో తుందని, ఈ రోజు దిగకపోతే రేపు ఫోటో దిగితే ఇన్సూరెన్స్ చెల్లదంటూ సిబ్బంది అంటున్నారని గాజర గ్రామానికి చెందిన చింతకుంట్ల సైదులు పేర్కొన్నారు. వినియోగదారులను భయభ్రాంతులకు గురి చేసి రూ. 200లను అక్రమంగా వసూలు చేస్తూ తనిఖీచేసిన రసీదులను అందిస్తున్నారని పేర్కొన్నారు.

**లైటర్ తీసుకుంటేనే రూ.500లకు సిలిండర్ వస్తోంది.**

**-కిట్యాల పద్మ వంగూరు**



రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన రూ. 500లకే సిలిండర్ అందిస్తుందని ప్రచారం చేయడంతో అదే అదునుగా గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు రూ.200లు పెట్టి గ్యాస్ ఏజేన్సీలో లైటర్ తీసుకుంటేనే రూ.500లకు సిలిండర్ పథకం వర్తిస్తుందని మాయ మాటలు చెప్పి ఖచ్చితంగాలైటర్ తీసుకునే వరకు వదలడం లేదని, మా ఇంట్లో లైటర్ ఉందని చెప్పిన కూడా వినకుండా అందిస్తున్నారని వంగూరు గ్రామానికి చెందిన కిట్యాల పద్మ తెలిపారు.

## అభివృద్ధి ముసుగులో వారి స్వలాభంకోసం పనులు చేసారు...

**లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ:ఎమ్మెల్యే మేఘా రెడ్డి**



లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులను పంపిణి చేస్తున్న ఎమ్మెల్యే మేఘా రెడ్డి

**వనపర్తి ప్రతినిధి, జనవరి 13, ప్రభాతవార్త :** గత పాలకులు అభివృద్ధి ముసుగులో వారి స్వలాభంకోసం పనులు చేసారే తప్ప నియోజకవర్గానికి, ప్రజలకు ఎలాంటి ఉపయోగం కలుగలేదని లేదని ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి విమర్శించారు. శనివారం వనపర్తి, గోపాల్ పేట, రేవల్లి మండల పరిషత్ కార్యాలయాల ఆవరణంలో ఏర్పాటు చేసిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమాలకు ముఖ్యఅతిధిగా ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి హాజరై లబ్ధిదారులకు చెక్కులను వేరువేరుగా పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వనపర్తి నియోజకవర్గంలో ప్రజల నుండి లక్షకుపైగా ప్రజా పాలన దరఖాస్తులు అందడం ద్వారా గత ప్రభుత్వాలు ప్రజలకు చేసిందేమిటో తేలిపోయిందన్నారు. ఏదుల రిజర్వాయర్ నిర్మాణంలో ఉన్నది మాట్లాడితే ఉలుకు పాటు ఎందుకని ప్రశ్నించారు. మట్టి అమ్ముకుని, కమిషన్లు దండుకొని కోట్లు కూడగట్టుకున్నారే తప్ప నియోజకవర్గ అభివృద్ధి గురించి ఆలోచించలేదని ఆయన విమర్శించారు. వాస్తవాలు మాట్లాడితే నాయకులకు వింగుడు పడడంలేదన్నారు. గత ప్రభుత్వంలో సంక్షేమ పథకాల కోసం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వేచి చూడాల్సిన పరిస్థితి ఉండేదని, ఇందిరమ్మ రాజ్యంలో ప్రజల వద్దకు ప్రభుత్వం పాలన వచ్చిందనీ, లబ్ధిదారుల చెంతకే పథకాలు ఫలాలు చేరుతున్నాయన్నారు. రాబోయే 100 రోజుల్లో మిగిలిన 5 గ్యారెంటీలను అమలు చేసే చూపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వనపర్తి ఎంపీపీ కిచ్చారెడ్డి, తాహసిల్దార్ యాదగిరి, సర్పంచ్ రవీందర్, మురళి, ఎంపిటీసీలునాగ రాజు, శాంతమ్మ, కురుమూర్తి, కొండన్న, శశిరేఖ, వెంకటయ్య, కౌన్సిలర్లు సత్యం, విభూది నారాయణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు బాలస్వామి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమ పాలన ధ్యేయంగా పనిచేస్తా..

**48 గంటల్లో రెండు పథకాలు**

**అమలు చేసిన ఘనత కాంగ్రెస్ దే**

**కాంగ్రెస్ కార్యకర్తలను గుండెల్లో పెట్టుకొని చూసుకుంటా.**

**మక్తల్ ఎమ్మెల్యే,వాకిటి శ్రీహరి.**

**కార్యకర్తల సమావేశానికి హాజరైన పీసీసీ**

**రాష్ట్ర అధికార ప్రతినిధి,కేశం నాగరాజుగౌడ్.**



సమావేశంలో మాట్లాడుతున్న మక్తల్ ఎమ్మెల్యే



కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

**అమరచింత, జనవరి 13, ప్రభాతవార్త :** రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సహకారంతో ప్రజా సంక్షేమ పాలన ధ్యేయంగా హరులైన పేదల సంక్షేమానికి పనిచేస్తానని మక్తల్ ఎమ్మెల్యే, వాకిటి శ్రీహరి అన్నారు. శనివారం అమరచింత మండల కేంద్రంలో పీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కేశం నాగరాజు గౌడ్ స్వగృహంలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశానికి మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి, కేశం నాగరాజుగౌడ్‌తో కలిసి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 48 గంటలలో రెండు సంక్షేమ పథకాలు అమలుచేసి దేశంలో చరిత్ర సృషించిన ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కిందని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల ప్రకారం ఇంకా నాలుగు సంక్షేమ పథకాలను వంద రోజులలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందని ఆయన తెలిపారు. రాష్ట్రంలో టిఆర్ఎస్, బిజెపి పార్టీలు కాంగ్రెస్ పార్టీ సాధ్యం కానీ హామీలు ప్రజలకు ఇచ్చి అధికారం చేపట్టిందని చెప్పడం విడ్డూరంగా ఉందని 48 గంటల్లో ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీకి అహర్నిశలు కష్టపడి కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషిచేసిన కాంగ్రెస్ కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి అయూబ్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, తెజ మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు, అరుణ్ కుమార్, మాజీ ఎంపీటీసీలు, మహా ఒకాళి విష్ణు, తిరుమలేష్, విష్ణు, శ్యామ్, ప్రకాశం, తిరుపతి, హనుమంతు నాయక్, దుబాయ్ మైను, లక్ష్మీ కాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి పల్లెలో అందరికి కేంద్ర ప్రభుత్వ పథకాలు

**కేంద్ర జలశక్తి డైరెక్టర్ రాజుకుమార్ మిశ్రా**



గ్రామంలో వైద్య సిబ్బందితో వివరాలు తెలుసుకుంటున్న కేంద్ర జలశక్తి డైరెక్టర్ ఐఏఎస్ రాజు కుమార్ మిశ్రా

**ఇటిక్యాల జనవరి 13, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రతి పల్లెలో అర్హులైన వారందరికి కేంద్ర ప్రభుత్వ పథకాలు అందివ్వడం జరుగుతుందని కేంద్ర జల శక్తి డైరెక్టర్ రాజకుమార్ మిశ్రా వివరించారు. శనివారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమంలో భాగంగా సాసనూల్ గ్రామ పంచాయితీలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జలశక్తి డైరెక్టర్ రాజ్ కుమార్ మిశ్రా ఐఏఎస్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్నటువంటి ప్రతి పథకానికి సంబంధించి ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందని అంతేకాకుండా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టినటువంటి ప్రతి పథకం గ్రామాల్లో ఉన్న ప్రతి పేదవాడికి అందించడమే దీని యొక్క ముఖ్య ఉద్దేశం అన్నారు. అలాగే అక్కడ ఏర్పాటు చేసినటువంటి స్టాల్స్ ఉజ్వల పథకానికి సంబంధించి హెల్త్‌కు సంబంధించిన వాటిని పరిశీలించడం జరిగింది. అదే విధంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్న వివిధ డిపార్ట్మెంట్లకు సంబంధించినటువంటి అధికారులు వారు అమలుపరిచే కార్యక్రమాలను గ్రామ ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పిసిఓ కాంతమ్మ, యూపీఐ డిప్యూటీ రీజినల్ అధికారి శ్రీనివాసమూర్తి, నాబార్డు డిడియం షణ్ముచ చారి, ఎల్‌డి. యం. అయ్యప్ రెడ్డి, ఏడిఏ సక్రియా నాయక్ , ఎంపీడీవో రాఘవ, ప్రోగ్రాం ఆఫీసర్ డా.రాజు, ఎంపీఓ భాస్కర్, పంచాయితీ కార్యదర్శి కౌసల్య, సర్పంచు మల్లన్న, వైద్యసిబ్బంది, సూపర్ వైజర్లు, హెల్త్ అసిస్టెంట్ ప్రభాకర్, ఏఎన్ఎం జానకమ్మ, దుర్గ, ఆశా కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## దొంగలు వస్తారు జాగ్రత్త..!

**ఇళ్లకు తాళాలు వేస్తే సమాచారం ఇవ్వాలంటున్న పోలీసులు**

**పండుగ వచ్చిందని త్వరగా గ్రామాలకు చేరుకుని తమ స్వంత వాళ్లను చూసుకోవాలనే ఉద్దేశ్యంతో చాలా మంది ప్రజలు తమ గ్రామాల వైపు వెళ్లుతుంటారు. త్వరగా వెళ్లాలన్న హడావిడిలో ఇంటికి ప్రధాన ద్వారం మాత్రమే తాళం వేసి లోపలి తలుపులు మూయకుండానే వెళ్తున్న సందర్భంలో తిరిగి తమ ఇండ్లకు వచ్చిన వెంటనే తమ వస్తువులు నగదు చోరి అయ్యిందంటూ పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేసే సందర్భాలు చాలానే ఉన్నాయి.**

**వనపర్తి ప్రతినిధి, జనవరి 13, ప్రభాతవార్త :** సంక్రాంతి పండుగ వచ్చిందని ఉద్యోగులు, ఇతర పనుల నిమిత్తం జిల్లా కేంద్రంలో స్థిరపడిన వారు తమ స్వంత గ్రామాలకు వెళ్లుతుంటారు. ఇలాంటి సమయంలో ఎక్కువగా చోరిలు జరిగే అవకాశాలున్నాయి. మరి దొంగతనాలు జరుగకుండా కొన్ని జాగ్రత్తలు పాటిస్తే మంచిదంటున్నారు పోలీసులు. ఇంటికి తాళం వేసి వెళ్లే సమయంలో పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పాటు చుట్టు పక్కలా వారికి ఇంటిని ఓ కంట కనిపెట్టమని చెప్పాలి ఇలా చేస్తే దొంగతనాల నుండి విముక్తి పొందవచ్చని జిల్లా పోలీసులు సూచిస్తున్నారు.

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు ...**

ముందుగా ఇండ్లకు నాణ్యవంతమైన తాళాలను వాడాలి.

ఇళ్లకు తాళాలు వేసే సమయంలో ఇంటిలో విలువైన వస్తువులను ఉంచరాదు .నగదును, విలువైన వస్తువులను ప్రజలు తమ వెంట తీసుకెళ్లాలి

ఇళ్ల నుండి బయటకు వెళ్లే సమయంలో తాళాలు సరిగా వేశామో లేదో అనేది సరి చూసుకోవాలి.

రాత్రి సమయంలో ఇంటి ముందు వరండాల్లో లైట్లు వెలిగేలా ఏర్పాట్లు చేసుకోవాలి

ఊర్లకు వెళ్లేవారు ద్విచక్ర వాహనాలకు వీల్‌లాక్ ఏర్పాటు చేసుకోవడం మంచిది.

తిరిగి ఎప్పుడు వస్తారో వంటి వివరాలు, చిరునామా, ఫోన్ నెంబర్ వంటివి దగ్గరలోని పోలీస్ స్టేషన్‌లో నమోదు చేసుకుంటే ఆయా ప్రాంతాల్లో గస్తీ పెంచే అవకాశం ఉంటుంది.

**ఊర్లకు వెళ్లేవారు సమాచారాన్ని పోలీసులకు అందించాలి...**

**మహేశ్వర రావు, పట్టణ సీఐ, వనపర్తి**



ఊర్లకు వెళ్లేవారు దగ్గరలోని పోలీస్ స్టేషన్‌లో సమాచారాన్ని ఇవ్వాలి. దీంతో ఎక్కువ చోరీలు జరిగే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. రాత్రి సమయంలో గస్తీ నిర్వహించే సిబ్బంది ఫోన్ నెంబర్‌ను సంబంధిత కాలని సభ్యులకు అందజేస్తాం. ఇంటి ముందు భాగమే తాళం వేసి, లోపలి తలుపులు సరిగా మూయకపోవడంతో చోరీలకు ఆస్కారం ఉంటుంది కావున అన్ని తలుపులు సరిగా మూసామో లేదో సరిచూసుకోవాలి. అనుమానంగా ఎవరైనా కనిపిస్తే వెంటనే డయల్ 100 కు సమాచారాన్ని అందించాలి...

# సంక్రాంతి వచ్చే.. సంబురాలే తెచ్చే..!

**తెలుగు సంస్కృతి సంప్రదాయాల్లో సంక్రాంతి పండుగకు విశిష్ట స్థానం ఉంది. కొత్త పంటలను ఇంటికి తీసుకొస్తూ కొంగొత్త ఆనందాలను ఇంటిల్లి పాదికి అందిస్తూ భోగభాగ్యాలు కల్పిస్తూ విరాజిల్లుతుంది. పిండి వంటలతో పండుగకు ప్రత్యేక శోభ తీసుకు వస్తుంది. పిల్లలతో పతంగులు ఎగుర వేయిస్తూ కేరింతలు కొట్టిస్తుంది. భోగితో మొదలై కనుమతో సాగి వెళ్తుంది. తెలుగు సంస్కృతి సంక్రాంతి పండుగ .**



జిల్లా కేంద్రంలో ముగ్గుల రంగులను కొనుగోలు చేస్తున్న మహిళలు

**వనపర్తి ప్రతినిధి, జనవరి 13, ప్రభాత వార్త :** తెలుగు సమాజంలోని అన్ని పండుగల మాదిరిగా సంక్రాంతి తిథి వారాలతో సంబంధం ఉన్నది కాదు, కాలగమనంలో ఒక రాశిలోకి సూర్యుడు మారుతుంటాడు, సూర్యుడు దక్షిణాయనం నుండి ఉత్తరాయణంలోకి ప్రవేశిస్తాడు. మకరరాశిలో సూర్యుడు ప్రవేశించిన రోజును మకరసంక్రాంతిగా పిలుస్తుంటారు. తెలంగాణలో గొబ్బెమ్మలు, నోములు, అరిసెలు, సకినాలు పిండి వంటలతో పాటు పతంగులు జరుపుకునే సంక్రాంతి ఎంతో విభిన్నమైందని చెప్పవచ్చు...

**భోగి:** భోగితో సంక్రాంతి పండుగ ప్రారంభమవుతుంది. శ్రీ వైష్ణవ సంప్రదాయంలో భోగి పండుగకు ప్రాముఖ్యత ఉంది. శ్రీ విల్లి వటపత్రశాయిని వ్రతం చేస్తూ ఆరాధించి అండాళ్ గోదాదేవిని సంక్రాంతి ముందు వచ్చే భోగిన రోజున శ్రీరంగనాథుడి వివాహమాడిందని పురాణాల ద్వారా తెలుస్తుంది. నీళ్లలో రేగిపండ్లు కాగించి ఆ నీళ్లతో స్నానం చేయడం భోగి ప్రత్యేకం.

**బొడబేడికెలు :** సంక్రాంతి పండుగ సమయంలో బియ్యం పిండితో అరిసెలు చేసుకోవడం ఆనవాయితి. మిగిలిన పిండితో చిన్నగా చిక్కుడు గింజల మాదిరిగా చేసి భోగి రోజున చిన్న పిల్లలకు దిష్టి తీసేందుకు ఉపయోగిస్తారు. ఉదయాన్నే స్నానమాచరించి నూతన వస్త్రాలు వేసుకుంటారు.

**గొబ్బెమ్మలు :** ఆవు పేడతో పిడికిలి పరిమాణంలో గోపురం ఆకారంలో చేసి వాటి మధ్యలో గరిక రెమ్మలు చెక్కి చుట్టూ పసుపు కుంకుమలతో అలంకరిస్తారు. వాకిళ్లలోని ముగ్గులు మధ్యన గడప గడపకు రెండు వైపులా జతలుగా పెడతారు వాటి చుట్టూ చిక్కుడు కాయలు రేగుపండ్లు, నవధ్యానాలు బంతిపూలను పోస్తారు.

**కనుమ :** సంక్రాంతి మరుసటి రోజున జరుపుకునే పండుగను కనుమ అంటారు. సంక్రాంతి నోములు నోముకున్న వారు తమ చుట్టూ పక్కల ఉన్న మెత్తైదులను పిలిచి నోము వస్తువులను వారికి వాయినంగా ఇస్తారు. పొలాలు దున్నే ఎద్దులకు కృతజ్ఞతలు తెలిపే విధంగా చేయడం ఆనవాయితి.

**ముగ్గులు :** సంక్రాంతిలో గీతల ముగ్గులకు మహిళలు ప్రాధాన్యం ఇస్తారు. భోగి రోజు భోగి కుండలు, పాల కుండలు సంక్రాంతి రోజు రథం ఇంటి లోపలికి ఇచ్చినట్లు వేసే ముగ్గులు, కనుమ రోజు రథం బయటకు వెళ్తుతున్నట్లు వేసే ముగ్గులను పిల్లలను, పెద్దలను అలరిస్తాయి చివరి రోజెన రథం ముగ్గు వేస్తారు.

**గంగిరెద్దుల సవ్వడి :** దూడూ బసవన్న అమ్మవారికి దండం పెట్టూ ఈ ఇంటికి మేలు జరుగుతుందని చెప్పు మంచి జరుగుతుందని చెప్పు అంటూ గంగిరెద్దుల తలలను ఊపిస్తూ గంగిరెద్దుల కులస్థులు నిత్యం మనకు కనిపిస్తుంటారు. గంగిరెద్దుల ఆటల్లో ఆకర్షణీయత ఉంటుంది. ప్రతి రోజు సూర్యోదయం కంటే పండుగ రోజులు ముందే లేచి రకరకాల బట్టలతో గంగిరెద్దులను అలంకరించుకుని వాయిద్యాలతో ప్రదర్శనకు బయలుదేరుతారు. సన్నాయి, బూర, డోలు, చేతిలో కంచుతో చేసిన చిన్న చేగుంట, నెత్తిన రంగుల తలగుడ్డ, చెవికి కమ్మల జోడు, భుజాల మీద కండువాలు, గంగిరెద్దులకు ఇచ్చిన శిక్షణ వారి ఆటపాటల్లో స్పష్టంగా కనిపిస్తుంది.

**జిల్లా కేంద్రంలో సంక్రాంతి వాతావరణం .....**

జిల్లా కు చెందిన ఎంతో జీవనోపాధి కోసం ఇతర హైదరాబాద్ వంటి మహానగరాల్లో నివసిస్తున్న ప్రజలు సంక్రాంతి పండుగ నేపథ్యంలో తిరిగి తమ గ్రామాలకు వస్తున్నారు. దీంతో హైదరాబాద్ నుండి జిల్లా కేంద్రానికి వచ్చే బస్సులన్ని ప్రజలతో కిటకిటలాడుతున్నాయి. సంక్రాంతి పండుగకు సంబంధించి ముగ్గుల రంగులు, వివిధ కొనుగోలు కేంద్రాల వద్ద జిల్లా కేంద్రంలోని ప్రజలతో పాటు ఆయా గ్రామాల నుండి వచ్చిన ప్రజలతో వ్యాపార సముదాయాల్లో పండుగ వాతావరణం ఏర్పడింది.

## సమాచార హక్కుచట్టం పరిరక్షణ కమిటి జిల్లా కమిటి ఏకగ్రీవ ఎన్నిక

### ఎలిగెండ్ల వెంకటేష్ ముదిరాజ్



**నారాయణపేట ప్రతినిధి, జనవరి13 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో సమావేశానికి ముఖ్య అతిథిగా సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎలిగెండ్ల వెంకటేష్ ముదిరాజ్ పాల్గొని, ఆర్టీఐ పిసి వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ ఆదేశానుసారం రాష్ట్ర కమిటి నిర్ణయం మేరకు ఆర్టీఐ పిసి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎలిగెండ్ల వెంకటేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో నారాయణపేట జిల్లా అధ్యక్షులుగా దినేష్ వర్మను నియమించడం జరిగింది. అలాగే జిల్లా ఉపాధ్యక్షులుగా చిన్నయ్య, జిల్లా కార్యదర్శిగా కావలి కిరణ్, జిల్లా సోషల్ మీడియా ఇంఛార్జిగా మాధవ్, నారాయణపేట అసెంబ్లీ ఇంఛార్జిగా ఎడ్ల కుర్మయ్యను నియమించడం జరిగింది. రాష్ట్ర అధ్యక్షులు ఎలిగెండ్ల వెంకటేష్ ముదిరాజ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీఐ కమిషన్‌లను నియమించాలని, వెంటనే రాష్ట్ర ప్రభుత్వం సమాచారహక్కు చట్టాన్ని నిర్లక్ష్యం చేయకుండా కమిషనర్‌ను నియమించి, ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం 2005 బోర్డును పెట్టాలని, అలాగే జిల్లా కమిటి సభ్యులు అవినీతిని అంతం చేయడమే లక్ష్యంగా పని చేయాలని కోరారు.

## కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరణ..



**వనపర్తి ప్రతినిధి, జనవరి 13, ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలోని 11వ వార్డు నాగవరం తండాలో కాంగ్రెస్ పార్టీ జెండాను శనివారం ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టత కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని సూచించారు. అనంతరం గ్రామ యువకులు సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహిస్తున్న క్రికెట్ క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ సుమిత్ర యాదగిరి కౌన్సిలర్లు చీర్ల సత్యం, విభూది నారాయణ, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు చీర్ల చందర్, షెఫి, లక్కాకుల సతీష్, నాయకులు సత్యశీల రెడ్డి మణిగిల్ల తిరుపతిరెడ్డి, గ్రామ ఎపార్టీ అధ్యక్షులు రమేష్ నాయక్, వాలి నాయక్, భాస్కర్ నాయక్, రాజు నాయక్, సురేష్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## జూనియర్ అసిస్టెంట్ సంధ్యను సన్మానించిన ఎమ్మెల్యే



**వనపర్తి టౌన్, జనవరి 13, ప్రభాతవార్త :** జి సంధ్య డాటర్ ఆఫ్ చంద్రకాంత్, చిమనగుంట పల్లి, వనపర్తి మండలం జిల్లా కోర్టు వనపర్తిలో జూనియర్ అసిస్టెంట్ గా ఉద్యోగం పొందిన సందర్బంగా స్థానిక ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి సన్మానించారు. తాను శ్రీ సాయి స్టడీ సర్కిల్ మహబూబ్‌నగర్‌లో కోచింగ్ తీసుకోవడం ద్వారా, కోచింగ్ సర్కిల్ డైరెక్టర్ చారి మరియు అధ్యాపక బృందం వారి ప్రత్యేక శిక్షణ, శ్రద్ద వల్ల ఉద్యోగాన్ని సంపాదించానని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టడీసర్కిల్ డైరెక్టర్ చారి, సురేష్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## అమరచింత తాండవాసులకు నీటి వసతి కల్పిస్తాం..



**అమరచింత, జనవరి 13, ప్రభాతవార్త :** అమరచింత మున్సిపల్ కేంద్రంలోని అమరచింత తాండ వాసులకు మంచినీటి వసతి కల్పిస్తామని అమరచింత మున్సిపల్ చైర్ పర్సన్, మంగమ్మ నాగభూషణం గౌడ్ అన్నారు. శనివారం అమరచింత తండాలో రెండు లక్షల నిధులతో చేపట్టనున్న పైపు లైన్ పనులను పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి, కేశం నాగరాజుగౌడ్ తో కలిసి పనులను పర్యవేక్షించారు. గిరిజన తండాలో పైపులైను లేక తాగునీటి కోసం గిరిజనులు ఇబ్బందులు పడుతున్న సందర్బంలో రెండు లక్షల నిధులతో పైప్ లైన్ పనులను పూర్తి చేసి గిరిజనులకు తాగునీటి అందిస్తామని వారు తెలిపారు. అలాగే అమరచింత పట్టణంలోని ఆరో వార్డులో మంచినీటి సౌకర్యం ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్దం చేయాలని మున్సిపల్ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్, జిఎస్ గోపి, మున్సిపల్ కమిషనర్, మహమ్మద్ కాజా, తదితరులు ఉన్నారు.

## గోదా కళ్యాణ మహోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

**బిజినేపల్లి, జనవరి 13 ప్రభాతవార్త :** వట్టెం శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ధనుర్మాస ఉత్సవాలలో భాగంగా ఈనెల ఆదివారం జరగనున్న శ్రీ గోదాదేవి కళ్యాణోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ వ్యవస్థాపక సభ్యులు సందడి ప్రతాపరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిఏటా ధనుర్మాసములో అత్యంత వైభవంగా నిర్వహించే ఈ గోదా కళ్యాణం ఉత్సవం ఆదివారం ఉదయం పదిన్నర గంటలకు దేవస్థానం ప్రధాన అర్చకులు కారంపూడి కృష్ణమాచార్యుల నేతృత్వంలో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఇందుకు సంబంధించి వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసి అశేష భక్తజనానికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని, కళ్యాణోత్సవం అనంతరం భక్తాదులందరికి అన్నప్రసాద వితరణ ఉంటుందని ఆయన అన్నారు. అత్యంత శాస్త్రోక్తంగా, వైభవంగా నిర్వహించే ఈ వేడుకలను తిలకించేందుకు భక్తాదులు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు.



## స్నేహభావంతో క్రీడాకారులు మెలుగాలి

### -మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్



**కల్వకుర్తి, జనవరి 13 ప్రభాతవార్త:** క్రీడాకారులు తాము ఆడుతున్న ఆటల్లో తోటి క్రీడాకారులతో స్నేహభావంతో మెలిగి గెలుపోటములను సమానంగా స్వీకరించాలని కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని కల్వకుర్తి పట్టణంలోని స్టేడియంలో రామాంజనేయ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్, కబడ్డీ టోర్నమెంట్‌లను మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్ క్రీడాకారులను పరిచయం చేసుకొని టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటపోటీల్లో గెలుపోటములు సహజమని, ఆటపోటీలకు నా సహకారం ఎల్లప్పుడు ఉంటుందన్నారు. ఆయన వెంట సింగిల్ విండో వైస్ చైర్మన్ సంజీవ్‌కుమార్, కౌన్సిలర్లు గోరటి శ్రీనివాస్‌లు, సతీష్, నాయకులు రమాకాంత్‌రెడ్డి, ఆంజనేయులు, విక్కి, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

**కల్వకుర్తిరూరల్, జనవరి 13 ప్రభాతవార్త:** కల్వకుర్తి మండలంలోని పంజుగుల గ్రామానికి చెందిన చిన్న జంగయ్య కొద్ది కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, తలకొండపల్లి జెడ్పీటీసీ ఉప్పల వెంకటేష్ తరుపున మృతి చెందిన చిన్న జంగయ్య కుటుంబానికి భారత జాగృతి విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు దారమోని గణేష్ ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ రూ. 3వేల ఆర్థిక సహాయాన్ని అందించడంతో మృతుడి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. ఆయన వెంట గ్రామ మాజీ సర్పంచ్ పరుశరాములు, వార్డు సభ్యులు ప్రభాకర్, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.



## గాలి పటం ఎగురవేస్తూ విద్యుదాఘాతానికి గురైన బాలుడు..

**అచ్చంపేట, జనవరి 13 ప్రభాతవార్త:** అచ్చంపేట పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర కాలనీలో శనివారం మధ్యాహ్నం సంక్రాంతి పండుగను పురస్కరించుకొని గాలిపటం ఎగురవేస్తూ విద్యుదాఘాతానికి 12 ఏళ్ల జోహెల్ అనే బాలుడు గురయ్యాడు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని ఆసుపత్రికి తరలించారు. పతంగికి మంజాదార ఉండటమే ప్రమాదమని పలువురు పేర్కొన్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# పాలమూరు పార్లమెంట్ స్థానం బీసీకే కేటాయించాలి..

**-మచ్చలేని ప్రధాని మోడీ హాట్రిక్ సాధిస్తాడు..!!**

**-అందిరికి ఆమోధయోగ్యుడైన శాంతికుమార్‌కే ఎంపి టికెట్ కేటాయించాలి..**

**-మీడియా సమావేశంలో ఎగ్గని నర్సింహులు**



భూత్పూర్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎగ్గని నర్సింహులు

**భూత్పూర్, జనవరి 13, ప్రభాతవార్త :** గడిచిన తొమ్మిదిన్నరేళ్లుగా దేశప్రధానిగా నరేంద్రమోడీ మచ్చలేని నాయకుడిగా ఎదిగి అందరి మన్నల్ని పొందారని, దేశాన్ని ప్రపంచ దేశాలలో అగ్రగామిగా నిలిపిన ఘనత ప్రధాని నరేంద్రమోడీకే దక్కుతుందని, మరో ఆర్నెళ్లలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ దేశంలో అఖండ విజయం సాధిస్తుందని, తిరిగి ప్రధానిగా నరేంద్రమోడీ హాట్రిక్ సాధిస్తారని బీజేపీ రాష్ట్ర నాయకుడు ఎగ్గని నర్సింహులు స్పష్టం చేశారు. శనివారం ఎగ్గని పార్టీ ఉమ్మడి జిల్లాల ముఖ్యనేతలతో కలిసి భూత్పూర్‌లో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎగ్గని మాట్లాడుతూ ప్రధాని మోడీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం బీసీలకు అధిక ప్రాధాన్యతనిస్తున్న నేపథ్యంలో ఈ పాలమూరు పార్లమెంట్ స్థానం బీసీలకే కేటాయించాలని అన్నారు. అందిరికి ఆమోధ్య యోగ్యుడైన పార్టీ రాష్ట్ర కోశాధికారి శాంతికుమార్‌కే ఇవ్వాలని, ఇది ఉమ్మడి పాలమూరు జిల్లాల పార్టీ నేతలు, కార్యకర్తల అభిప్రాయమని పేర్కొన్నారు. గతంలో పార్టీ జాతీయ నేతలైన ఎపి జితేందర్‌రెడ్డి, డీకే అరుణలకు పార్టీ నుంచి పలు మార్లు పదవులు దక్కాయని ఈ సారి పాలమూరు నుంచి ఎంపి స్థానానికి బీసీ అభ్యర్థికే ఛాన్స్ ఇవ్వాలని ఆయన తన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఎపి జితేందర్‌రెడ్డి కూడా ఎంపి అభ్యర్థిగా శాంతికుమార్ పేరునే ప్రతిపాదిస్తున్నారని, మాజీ మంత్రి డీకే అరుణ కూడా శాంతికుమార్‌పేరును పాలమూరు ఎంపి అభ్యర్థిగా బలపర్చాలని ఎగ్గని కోరారు. పాలమూరు ఉమ్మడి జిల్లాల పార్టీ నేతలు, కార్యకర్తలు అధికశాతం ఎంపి అభ్యర్థిగా శాంతికుమార్ పేరునే బలపరుస్తున్నారని, ప్రధాని మోడీ పాలమూరు ఎంపి స్థానాన్ని బీసీ సామాజిక వర్గానికి చెందిన శాంతికుమార్‌కే కేటాయించాలని కోరారు. మీడియా సమావేశంలో ఫిలిం బోర్డు మెంబర్ మాధవరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మద్దిగట్ల రవీందర్‌రెడ్డి, దళిత మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాయిరాం, పార్టీ భూత్పూర్ పట్టణ శాఖ అధ్యక్షుడు గంగాపురం రవీందర్, మీడియా సెల్ కన్వీనర్ గొడుగు అంజనేయులుతో పాటు నాయకులు సత్తయ్యగౌడ్, రాజేందర్, వెంకట్‌రెడ్డి, అంజయ్య, ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 7 గొర్రెల అపహరణ.. రూ.3 లక్షల నష్టం..!



అపహరణకు గురైన గొర్రెల మందను పరిశీలిస్తున్న ఎస్సై గురుస్వామి

**ఉప్పునుంతల, జనవరి 13 ప్రభాతవార్త :** మండలంలోని రాయిచేడు గ్రామంలో శుక్రవారం రాత్రి 11 గం.ల తర్వాత గాఢనిద్రలో ఉన్న సమయంలో జాజాల శ్రీనుకు చెందిన 16 గొర్రెలు, మేకలను గొర్రెల మంద నుంచి గుర్తు తెలియని వాహనంలో అపహరించుకుని వెళ్లినట్లు బాధితుడు రోదిస్తూ తెలిపారు. శుక్రవారం రాత్రి జాజాల శ్రీను, ఆయన సతీమణి జాజాల భాగ్యమ్మ తన ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో ఇంటికి బయటి నుంచి గొళ్లెం పెట్టారు. ఇంటి ముందు ఉన్న కరెంటు బల్బును తొలగించారు. అదే విధంగా తన ఇంటిముందు ద్విచక్రవాహనం ఉండడంతో వెంటనే బండి స్టార్ట్ కాకుండా వైర్లను తొలగించారు. గొర్రెలను దొంగిలిస్తుండగా ఇంట్లో నిద్రిస్తున్న బాధితుడు కేకలు పెట్టారు. వెంటనే గుర్తు తెలియని వాహనం శ్రీశైలం హైదరాబాద్ ప్రధాన రహదారి వైపు అతివేగంగా వెళ్లిందని బాధితులు శ్రీను, భాగ్యమ్మలు తెలిపారు. బాధితుడు తండ్రి వయోవృద్ధుడు కావడంతో పాటు గొర్రెలను కాపలా ఉండి పొద్దంతా తిరిగి రావడంతో అలిసిపోయి గాఢనిద్రలోకి చేరుకున్నాడు. ఇంట్లో నుంచి కొడుకు, కోడలు కేకలు వేస్తుండడంతో లేచాడు. అప్పటికే దొంగలు గొర్రెలను దొంగిలించుకుని వెళ్లిపోయారు. ఇంటి దొంగలు పెట్టిన గొళ్లెం తీశాడు. ఇంట్లో నుంచి మంద దగ్గరికి వచ్చి చూడగా 15 గొర్రెలు 1 మేకను దొంగలు దొంగిలించుకుని వెళ్లారని, బాధితులు లబోదిబోమంటూ గ్రామస్తులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఉప్పునుంతల పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని జరిగిన సంఘటనపై విచారిస్తున్నారు. చోరీకి గురైన గొర్రెల విలువ దాదాపు 3 లక్షల వరకు ఉంటుందని బాధితులు తెలిపారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై గురుస్వామి తెలిపారు. గ్రామ శివారులో ఇల్లు, గొర్రెల మంద ఉండడంతో అదే అదునుగా భావించి దొంగతనానికి పాల్పడినట్లు పలువురు అంటున్నారు. ఈ సంఘటనపై పోలీస్ ఉన్నతాధికారులకు సమాచారం అందించినట్లు ఎస్సై గురుస్వామి తెలిపారు. పోలీసు ఉన్నతాధికారులు సంఘటన స్థలానికి క్లూస్ టీంను పంపించారు.

## కుంభం శివకుమార్‌రెడ్డికి ఎమ్మెల్సీ లేదా రాష్ట్ర కార్పోరేషన్ చైర్మన్ పదవి ఇవ్వాలి:కౌన్సిలర్ ఎండి సలీం

**నారాయణపేట ప్రతినిధి, జనవరి13 ప్రభాతవార్త :** సుమారు గత ఇరవైఏళ్లుగా నారాయణపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి అనేక సేవలందించడమే కాకుండా ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డా. చిట్టెం పర్ణికారెడ్డి గెలుపులో కీలకంగా వ్యవహరించిన మాజీ డిసిసి అధ్యక్షులు కుంభం శివకుమార్‌రెడ్డికి ఎమ్మెల్సీ లేదా రాష్ట్ర కార్పోరేషన్ చైర్మన్ పదవి ఇవ్వాలని నారాయణపేట కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ ఎండి సలీం శనివారం ఒక ప్రకటనలో కాంగ్రెస్ అధిష్టానాన్ని కోరారు. నియోజకవర్గంలో ఇరవై ఏళ్ల ఉండి సొంత నిధులతో ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేయడమే కాకుండా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న కుంభం శివకుమార్‌రెడ్డికి సమీకరణలో భాగంగా నెల రోజుల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ పోటీచేసే అవకాశం ఇవ్వకున్నా, అధిష్టానం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపులో ప్రధాన భూమిక పోషించారన్నారు. ఇరవై ఏళ్లుగా పార్టీ నాయకులకు, కార్యకర్తలకు అండగా ఉంటూ పార్టీకోసం పని చేసిన కుంభం శివకుమార్‌కు ఎమ్మెల్సీ లేదా రాష్ట్ర కార్పోరేషన్ చైర్మన్ పదవి ఇచ్చి సముచిత స్థానం కల్పించాలన్నారు. నియోజకవర్గంలో అత్యంత ప్రజాదరణ పొందిన నేతగా ఉంటూ కాంగ్రెస్ పార్టీ నుండి వరుసగా గతమూడు అసెంబ్లీ ఎన్నికల్లో (2009, 2018, 2023) ఎమ్మెల్యేగా పోటీచేసి గెలిచే అవకాశం ఉన్న పార్టీ మూడు సార్లు వారికి ఎమ్మెల్యే ఎమ్మెల్యే టికెట్ ఇవ్వలేదన్నారు. అయిన కూడా పార్టీ పెద్దలు, క్యాడర్ నిర్ణయం మేరకు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపుకు కృషి చేశారన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో సీనియర్ రాజకీయ నేగా పరిపాలనలో అపార అనుభవం ఉన్న కుంబం శివకుమార్‌రెడ్డికి ఎమ్మెల్సీ పదవి లేదా రాష్ట్ర కార్పోరేషన్ చైర్మన్ పదవి ఇచ్చి ప్రభుత్వ పరిపాలనలో వారి సేవలను ఉపయోగించుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని పత్రికా ముఖంగా కోరారు. కుంభం శివకుమార్‌రెడ్డికి ప్రభుత్వ పదవి ఇచ్చినట్లయితే వెనుకబడిన నారాయణపేట జిల్లా అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## భూత్పూర్ బీసీ కాలనీలో అయోధ్య రాముని అక్షితల వితరణ..!!

### - అక్షితలను పంపిణీ చేసిన శ్రీఅంజనేయ భజన బృందం సభ్యులు..



అయోధ్య రాముని అక్షితలను భజన బృందం సభ్యుల చేతుల మీదుగా స్వీకరిస్తున్న కాడ్లూర్ చాముండేశ్వరి

**భూత్పూర్, జనవరి13, ప్రభాతవార్త :** హిందువుల ఆరాధ్య దైవం అయోధ్య రాముని అక్షితలను శనివారం భూత్పూర్ బీసీ కాలనీ శ్రీ అంజనేయ భజన బృందం సభ్యులు మేళ తాళాలతో ఇంటింటికి పంపిణీ చేశారు. అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ట ఈ నెల 22న ప్రధాని మోడీ చేతుల మీదుగా జరుగనుండగా దేశమంతటా అయోధ్య శ్రీరాముని అక్షితలను ఊరూరా పంపిణీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో భక్తులు, వీహెచ్‌పీ నాయకులు, కార్యకర్తలు అక్షితల వితరణ కార్యక్రమానికి పక్షం రోజుల నుంచి శ్రీకారం చుట్టారు. అయోధ్య తెచ్చిన అమూల్యమైన ఈ అక్షితలను అత్యంత భక్తి శ్రద్దలతో ఆయా ఇంటి వద్ద గృహిణులు, ఇంటి యజమానులు ఎంతో నిష్టతో మంగళ హారతులతో స్వీకరిస్తున్నారు. బీసీకాలనీలో భజన బృందం సభ్యులు తెచ్చిన అయోధ్య రాముని అక్షితలను పవిత్రహృదయంలో స్వీకరిస్తూ తమ ఇంట్లోని దేవుడిగదిలో భద్రపరుచుకుంటున్నారు. శనివారం అక్షితల వితరణ కార్యక్రమంలో భూత్పూర్ శ్రీఅంజనేయ భజనబృందం సభ్యులు సత్తూర్ కృష్ణయ్యగౌడ్, తిర్లపురం విజయ్‌కుమార్, హస్నాపూర్ కొండన్న, బజార్‌పరుశురాం, రామస్వామి యాదవ్, శ్రీనువాసులు తదితరులు అయోధ్య రాముని అక్షితలను పంపిణీ చేయగా బీసీ కాలనీకి చెందిన కాడ్లూర్ చాముండేశ్వరి అత్యంత భక్తిశ్రద్దలతో, పవిత్ర నిష్టతో స్వీకరించారు.

## అయోధ్య అక్షింతలకు రాజకీయాలకు ముడిపెట్టొద్దు

### బిఆర్ఎస్ నేత కెటీఆర్, వీహెచ్‌పి

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 13 ప్రభాతవార్త :** భారతరాష్ట్ర సమితి నేత, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు అయోధ్య అక్షింతల విషయంలో రాజకీయాలు మాట్లాడడం సరికాదని విశ్వహిందూ పరిషత్ ఆగ్రహం వ్యక్తం చేసింది. అయోధ్య రాముల వారి అక్షింతలను రాజకీయాలకు ముడిపెట్టడం కెటిఆర్ అవగాహన రాహిత్యానికి, అహంకారానికి నిదర్శనమని ఆరోపించారు. పవిత్రమైన ఆయోధ్య శ్రీరాముల వారి మందిర ప్రారంభం శ్రీ బాల రాముడి ప్రాణ ప్రతిష్ట సందర్భంగా రాజకీయాలకతీతంగా ప్రతి ఒక్కరిని ఈ మహా కార్యంలో భాగస్వాములను చేసేందుకు శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టు పని చేస్తుందన్నారు. అందులో భాగంగానే ప్రతిఇంటికి వెళ్లి అయోధ్య రాములవారి అక్షింతలు అందజేసి, రామకార్యంలో పాలుపంచుకునేందుకు అందరిని ఆహ్వానిస్తున్నామని విశ్వహిందూ పరిషత్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు సురేందర్‌రెడ్డి, కార్యదర్శి పండరినాథ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అయితే రాజకీయాలకు అయోధ్య రాముడు అక్షింతలకు సంబంధం లేదనే విషయం కెటిఆర్ తెలుసుకోవాలన్నారు. యాదాద్రి నరసింహ స్వామి అక్షింతలను మేము కూడా రాష్ట్రంలో పంచి ఉంటే ఎన్నికల్లో గెలిచే వాళ్లని అని కెటిఆర్ మాట్లాడడాన్ని తప్పు పట్టారు. శ్రీరాముల వారి అక్షింతల విషయంలో రాజకీయాలను పోల్చి మాట్లాడడం పవిత్రమైన రామకార్యాన్ని అవమానించినట్లేనని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐదు శతాబ్దాలుగా, లక్షలాదిమంది రామభక్తులు, కరసేవకుల త్యాగఫలమే అయోధ్య రామమందిరం అని వారు గుర్తు చేశారు. అక్షింతలను రాజకీయాలతో ముడిపెట్టి కోట్లాదిమంది రామభక్తుల మనోభావాలు దెబ్బతీసిన కెటిఆర్ హిందూ సమాజానికి, రామభక్తులకు క్షమాపణ చెప్పాలని విశ్వహిందూ పరిషత్ నేతలు డిమాండ్ చేశారు. అసలు దేవుడిని నమ్మని నాస్తికుడు కెటిఆర్ రాముడి అక్షింతల విషయంలో వ్యంగ్యంగా మాట్లాడడం ఏ మాత్రం సరికాదని వారు హెచ్చరించారు.

## ఆడపడుచులకు అండగా నిలిచిన నిరంజన్ రెడ్డి కృతజ్ఞతలు...



కళ్యాణ లక్ష్మి చెక్కులను అందుకున్న మహిళలు బి.ఆర్.ఎస్ నాయకులను

**వనపర్తి టౌన్, జనవరి 13, ప్రభాతవార్త :** నియోజకవర్గ వ్యాప్తంగా మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి కృషి వల్ల గత ప్రభుత్వంలో వివిధ వార్డులో, గ్రామాలలో మంజూరు అయిన 161 కళ్యాణ లక్ష్మిచెక్కులను ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు అందజేశారు. కళ్యాణ లక్ష్మి చెక్కులను అందుకున్న మహిళలు బి.ఆర్.ఎస్ నాయకులను కలుసుకొని నిరంజన్ రెడ్డి, గూర్పి వాకబు చేశారు. నిరుపేదలమైన మాకు కళ్యాణ లక్ష్మి నిధులను ఇప్పించి నిరంజన్ రెడ్డి మాకు అండగా నిలిచారని అన్నారు. కేసీఆర్, అండదండలతో నిరంజన్ రెడ్డి ఈ నియోజకవర్గంలో దాదాపు 9149 కళ్యాణ లక్ష్మి మరియు షాది ముబారక్ చెక్కులను ఇప్పించిన ఘనత నిరంజన్ రెడ్డి దక్కుతుందని మహిళలు అంటూ ప్రభుత్వం ఇచ్చిన చెక్కులు రావడానికి కృషి చేసిన చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్స్ చేతుల మీదుగా అందుకు న్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ వైస్, చైర్మన్ గట్టు యాదవ్, వాకిటి. శ్రీదర్ కౌన్సిలర్స్ లక్ష్మినారాయణ బండారు. కృష్ణ, పాకనాటి. కృష్ణ, కంచె. రవిపుట్టపాక. మహేష్, జంపన్న, నాగన్న యాదవ్, మీడియా కన్వీనర్ నందిమల్ల. అశోక్ నాయకులు ఉంగ్లమ్మ. తిరుమల్ల్, శరవంద, ఐ.ఐ.సి కృష్ణ, స్టార్. రహీమ్, గోపాల్ యాదవ్, సినియర్ నాయకులు చెన్నరాములు, నీలస్వామి, గులాం ఖాదర్ ఖాన్, చిట్యాల. రాము, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## అయోధ్య అక్షింతల పంపిణీ..



**నారాయణపేట ప్రతినిధి, జనవరి 13 ప్రభాతవార్త :** మండలంలోని సామాన్‌పల్లి గ్రామంలో శనివారం అయోధ్య అక్షింతల పంపిణీ శో భాయమానంగా నిర్వ హించారు. ఈసందర్భంగా గ్రామ యువ జన సంఘం, భజన మండలి భక్తులు భక్తి సంకీర్తనలు ఆలపిస్తూ, మహిళల మంగళ హారతులతో గ్రామంలో ఇంటింటికి తిరిగి అయోధ్య అక్షతలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వెంకటన్న, ఉపసర్పంచ్ పుష్పవతి, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి కౌన్సిలర్ ఆర్థిక సహాయం..

**వనపర్తి టౌన్, జనవరి 13, ప్రభాతవార్త :** 6వ వార్డ్ మెట్టుపల్లికి చెందిన మృతుడు సుగూరు. రాములు అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న స్థానిక కౌన్సిలర్ కంచె. రవి వారి కుటుంబాన్ని పరామర్శించి. 5000 రూపాయలు మృతుని భార్య బీసమ్మకు అంత్రక్రియల కోసం అందించారు. కుటుంబానికి బిఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని అన్నారు.



## బ్రహ్మోత్సవాలకు మాజీ ఎమ్మెల్యేకు ఆహ్వానం..



**ఇటిక్యాల జనవరి 13, ప్రభాతవార్త:** మండల పరిధిలోని పెద్దదిన్నె గ్రామంలో వెలసిన వెంకటేశ్వర స్వామి జాతర బ్రహ్మోత్సవాలు ఈ నెల 20వ తేది నుండి మొదలవుతుండగా జాతర బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని శనివారం హైదరాబాదులోని మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ నివాసంలో ఆలయ ప్రధాన అర్చకులు గ్రామ పెద్దలు కలిసి ప్రత్యేక ఆహ్వానం అందజేశారు. ఈ సందర్భంగా ఆహ్వాన పత్రిక అందజేసి స్వామి వారి శేష వస్త్రాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ తాలూకా అధ్యక్షుడు ఎర్రవల్లి సర్పంచు జోగుల రవి, మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, జిల్లా కార్యదర్శిలు శ్యామ్ రావు, మెడికల్ మద్దిలేటి , పెద్దదిన్నె మాజీ సర్పంచి శ్రీనాథ్ రెడ్డి , సోమిరెడ్డి, అంజి, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

## టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడులలో 8 క్వింటాళ్ల పిడిఎస్ రైస్ పట్టివేత

**నారాయణపేట ప్రతినిధి, జనవరి13 ప్రభాతవార్త :** మరికల్ పోలీస్ స్టేషన్ పరిధిలో పూసల్‌పాడు గ్రామంలో నాగరాజు తండ్రి శాంతన్నకు చెందిన ఇంట్లో గ్రామంలో చుట్టుపక్కల ఇళ్ల నుండి పిడిఎస్ రైస్ సేకరించి తన ఇంట్లో డంపు చేయగా పక్కా సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించగా 16 బ్యాగు లు, 8 క్వింటాళ్ల పిడిఎస్ రైస్‌ను పట్టుకొని మరికల్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. మరికల్ ఎస్సై హరిప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ డిటి పంచనామా అనంతరం నాగరాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడం జరుగుతుందని తెలిపారు.



## అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత

**నారాయణపేట ప్రతినిధి, జనవరి 13 ప్రభాతవార్త :** ధన్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో కోయిలకొండ నుండి ధన్వాడ చర్లపల్లి గ్రామానికి తెల్లవారుజామున అక్రమంగా ఇసుక తరలిస్తున్న సమయంలో మేకల రాజు తండ్రి సాయన్న, కుసుమద్‌పల్లి, కోయిల్‌కొండ మండలం, మేకలి చింటూ తండ్రి రాములు కుసుమద్‌పల్లి, కోయిల్‌కొండ మండలం, మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఇద్దరు వ్యక్తులు తెల్లవారుజామున అక్రమంగా ఇసుక తరలిస్తుంటే టాస్క్‌ఫోర్స్ పోలీసులు చర్లపల్లి గ్రామ శివారులో దాడులు నిర్వహించి రెండు ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్ స్టేషన్‌లో అప్పగించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్సై రమేష్ మాట్లాడుతూ తెల్లవారుజామున అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడం జరుగుతుందని తెలిపారు.



## గిరిజన ఉద్యోగుల సంఘం కార్యవర్గం ఎన్నిక

**చిన్నచింతకుంట, జనవరి 13 ప్రభాతవార్త :** గిరిజన ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. సంఘం గౌరవ అధ్యక్షులుగా ఎంఈఓ లక్ష్మణ్‌సింగ్, అధ్యక్షులుగా గంగయ్య, ప్రధాన కార్యదర్శి రాజునాయక్, అసోసియేట్ అధ్యక్షులుగా రవికుమార్, కోశాధికారిగా వెంకట్‌నాయక్, మహిళా విభాగం అధ్యక్షురాలుగా రజిత, ఉపాధ్యక్షురాలుగా రాజేశ్వరిలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో గిరిజన ఉద్యోగ సంఘ నాయకులు పాల్గొన్నారు.



# మహిమనిత్వమైన మహేశ్వరుడి కోవెల...

- ఈ నెల 15 నుంచి ఉమ మహేశ్వర బ్రహ్మోత్సవాలు
- వేలాదిగా తరలిరానున్న భక్తులు
- అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయనున్న ఆలయ సిబ్బంది

**అచ్చంపేట, జనవరి 13 ప్రభాతవార్త:** ఎత్తైన కొండలు, దట్టమైన అడవీ ప్రాంతం. కొండపై జాలువారే సెలయేరుల మధ్య ప్రజలు, భక్తులకు దర్శనమిచ్చి ఉమమహేశ్వరుడు భక్తుల పాలిట దైవంగా మారారు. శ్రీశైల మల్లన్న జ్యోతిర్లింగానికి ఉత్తర ద్వారంలో ఉన్న మహేశ్వరుడిని కొలిచిన భక్తులకు కొంగు బంగారమై ఇంటిల్లిపాదిని ఎల్లవేళలా కాపాడుతూ భక్తుల వెంటే ఉంటే వారు చేసే పనిలో అభివృద్ధి చెందే విధంగా తోడుంటారని మహేశ్వరుడిని ఇష్టదైవంగా కొలుస్తూ భక్తులు కన్నుల పండువగా మహేశ్వరుడి ఉత్సవాలకు హాజరవుతూ తమ మొక్కుబడులను చెల్లించుకుంటారు.

**పురాణ ప్రసిద్ధి...** అష్టాదశ పురాణాల్లో స్కంధుడు(కుమారస్వామి) రచించినదే స్కంధ పురాణం. స్కంధుడు నందీశ్వరుడు మాత్రమే శివుని యొక్క మహిమలను పూర్తిగా ఎరిగిన వారు. శ్రీశైలం ఖండము స్కంధ పురాణంలోనే ఉన్నది. శ్రీశైలం ఖండమునందు శ్రీశైల క్షేత్ర వర్ణము, దాని నాలుగు ద్వారముల మహత్యం వ్రాయబడినది. శ్రీశైలమునకు తూర్పు ద్వారాము త్రిపురాంతకము, పశ్చిమ ద్వారము అలంపురం, దక్షిణ ద్వారాము సిద్దవటము, ఉత్తర ద్వారాము ఉమ మహేశ్వర క్షేత్రాలుగా ప్రసిద్దికెక్కినవి. శ్రీరాముడు రావణసురుడి వద అనంతరం శ్రీశైల ప్రదిక్షిణమునకు ఈ క్షేత్రము నుంచి ప్రారంభించినట్లు స్కంధ పురాణం ద్వారా తెలుపబడినది.

**క్షేత్ర మహిమము...** ఈ క్షేత్రములో పంచతీర్థములున్నవి. అందువల్ల ఈ క్షేత్రమునకు మహాతీర్థమని పేరు వచ్చినది. ఈ క్షేత్రమునకు బంగారు అణు మాత్రమిచ్చినను. అది సప్తద్వీపములతో గూడిన భూమినంత దానమిచ్చినంత ఫలము దక్కును. ఇక్కడ పట్టెడన్నం దానం చేసిన లెక్కలేనంత మంది తపస్సులకు దానం చేసిన ఫలితం దక్కుతోంది. ఉమ మహేశ్వర ఆలయ ప్రాంగణంలో ఒక్క రాత్రి నిద్రపోయిన మానవుడు కాశీ, గయ, ప్రయాగాది పుణ్యక్షేత్రాల్లో అనేక లక్షల సంవత్సరములు నివసించిన ఫలము పొందుతారు. ఇచ్చట మృతి చెందిన జీవులు అగ్నిలో ఆహుతులు చేరునట్లు ఈశ్వరుడిలో చేరెదరు. ఈ ద్వారామును సవారి వారసుడైన కుబేరుడు రక్షించుచున్నాడు. ఇక్కడ ఆయన రాజధాని చంద్రప్రభనగరము కలదు. అది సిద్దులైన మహార్షులకే కనబడుతోంది. ఈ క్షేత్రములు సాధకులకు సర్వసిద్దులు కలుగుతాయి. మహాశివరాత్రి పర్వదినాన ఉమ మహేశ్వరులను సేవించుటకు ముల్లోకముల కన్యలు, దేవ గణములు ఇక్కడికి చేరుకుంటారు. స్వామిని సేవించేవారు అంతమున శివ సాయుజ్యమును పొందుతారు. ఈ క్షేత్రము యొక్క మహిమలు స్కంధ పురాణంలో తెలుపబడినది. ఈ క్షేత్రము కూడా శ్రీశైలం వల్లనే ప్రాచీనమైనది.



ఉమ మహేశ్వర ఆలయం

**బ్రహ్మోత్సవాల వివరాలు...**

ఈ నెల 15న సోమవారం సాయంత్రం 4 గంటలకు అయ్యప్పస్వామి పూజ, 6 గంటలకు జ్యోతి సమయంలో మంగళహారతి, 7గంటలకు కుంకుమార్చన, ధ్వజారోహణ, అగ్ని ప్రతిష్టాపన, బలిహరణము, నిరాజనము, మంత్రపుష్పము, తీర్థప్రసాద వినియోగం. రాత్రి 2 గంటలకు ప్రభోత్సవము తదనంతరం స్వామి వారి మంగళవాయిధ్యములతో కొండపై నుంచి పల్లకి సేవ. తెల్లవారుజామున 4 గంటలకు పార్వతి పరమేశ్వరుల దివ్య కళ్యాణోత్సవం జరుపబడును. 16న మంగళవారం ఉదయం 6 గంటలకు పల్లకిలో ఉమ మహశ్వేరం చేరడం, 9 గంటలకు గవ్యాంత పూజలు, వాస్తు పూజా, వాస్తు హోమం, రుద్రాభిషేకం, రుద్ర హోమము, ప్రాతరౌపాసన, నిత్యబలిహరణ, సాయంత్రం 4 గంటలకు నీలలోహిత పూజ, సాయమౌపాసన, బలిహరము, నీరాజనము, మంత్రపుష్పము, తీర్థప్రసాద వినియోగం, 17న బుధవారం 9 గంటలకు ప్రాతరౌపాసన, బలిహరణ, నీరాజనము, మంత్రపుష్పము, తీర్థప్రసాద వినియోగం, సాయంత్రం 4 గంటలకు సాయమౌపాసన, సదస్యం, బలిహరం, నీరాజనము, అశ్వ వాహన సేవ, మంత్రపుష్పము, తీర్థప్రసాద వినియోగం, 18న గురువారం ఉదయం 9 గంటలకు గవ్యాంత పూజలు, అమ్మవారికి పూజలు, సహస్రనామార్చన, రుద్రాభిషేకం, రుద్రహోమంతో పాటు నిత్య పూజా కార్యక్రమాలు నిర్వహించి ఈ నెల 22న స్వామి వారి ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ చైర్మన్ కందుకూరి సుధాకర్, దేవాదాయ ఈఓ శ్రీనివాస్‌రావులు తెలిపారు.

## బ్యాంకుల ఏర్పాటుకు కృషిచేస్తా:మంత్రి జూపల్లి కృష్ణారావు

**చిన్నంబావి, జనవరి 13 ప్రభాతవార్త :** కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో నూతనంగా ఏర్పడిన చిన్నంబావి మండల కేంద్రంలో బ్యాంకులు ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు వెల్టూరు గుందిమల్ల సాధన సమితి నాయకులు పెరుమాళ్ళ శ్రీనివాస్ ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. శనివారం తెలంగాణ సచివాలయంలో మంత్రి జూపల్లి కృష్ణారావు చాంబర్‌లో చిన్నంబావి మండల కేంద్రంలో యూనియన్ బ్యాంకు లేదా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏర్పాటు చేయాలని పెరుమాళ్ళ శ్రీనివాస్ కోరారు. ఈ విషయంపై స్పందించిన మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ వీలైనంత త్వరగా బ్యాంక్ ఏర్పాటుకు కృషి చేస్తానని చిన్నంబావి వేగంగా అభివృద్ధి చెందుతున్నదని బ్యాంకుల ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉందని అన్నారు. సంబంధిత బ్యాంకు శాఖ అధికారులకు లేఖరాసి మంజూరుకు కృషి చేస్తానని అన్నారు. భవిష్యత్తులో చిన్నంబావి మీదుగా 44 నేషనల్ హైవే అలంపూర్ చౌరస్తా నుండి వయా చిన్నంబావి, కొల్లాపూర్, లింగాల మీదుగా మరో నేషనల్ హైవే వస్తుందని చిన్నంబావిని మోడల్ మండలంగా తీర్చిదిద్దుతానని మంత్రి జూపల్లి అన్నారు. యూనియన్ బ్యాంకు, స్టేట్ బ్యాంకు ఏర్పాటుకు అనిన రకాల అవకాశాలను ఉపయోగించుకుని ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బన్నెల శివమల్లయ్య, పుసలపటి కురుమయ్య, ఎనుముల పరశురాముడు, శ్రీనివాస్ పాల్గొన్నారు.



## కానాయపల్లిలో క్రికెట్ టోర్నమెంట్..

**కొత్తకోట, జనవరి 13, ప్రభాతవార్త :** కొత్తకోట మండలం కానాయపల్లి గ్రామంలో శనివారం దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి సహకారంతో సంక్రాంతి పండుగ సందర్భంగా చత్రపతి శివాజీ యూత్ ఆధ్వర్యంలో కానాయపల్లి ప్రీమియర్ లీగ్ 2 క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యాతిథిలుగా మాజీ ఎంపీపీ రావుల జితేంద్రనాథ్ రెడ్డి పాల్గొని క్రికెట్ పోటీలను ప్రారంభించారు. మొదటి విజేతకు 5116, రెండో విజేతకు 3116 రూపాయలు నగదు అందజేయనున్నట్లు నిర్వాహకులు శివ యాదవ్ తెలిపారు. ముందుగా ముఖ్యాతిథిలుగా విచ్చేసిన రావుల గ్రామ సీనియర్, జూనియర్ జట్టులకు టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక పునరుత్తేజానికి నిదర్శనమని అన్నారు. ఆటలు ఆడడం ద్వారా మానసిక ప్రశాంతత దొరుకుతుందని అన్నారు. మన గ్రామంలో యువకులు క్రీడలో రాణించాలని చెడు వ్యవసనాలకు దూరంగా ఉండి మన గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. మంచి పని చేసే వారికి నేను ఎప్పుడు మీకు సహకరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ టీంలో కెప్టెన్ నక్కల శాంతన్న, వైస్ కెప్టెన్ డీలర్ శ్రీనివాసులు, శేఖర్ గౌడ్, హెూటల్ రాజు, ధనుష్, కొత్త నర్సింహ, దారమోని నాగరాజు, దారమోని బాలరాజు, బాజ సిద్దయ్య, కొత్త నర్సింహ, వడ్డే నాగరాజు, బొజ్జన్న, కొత్త రాములు, బుగ్గపల్లి వెంకటయ్యలు, నాయకులు యువకులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు జరగాలి..

**పెబ్బేరు, జనవరి 13, ప్రభాతవార్త :** ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు జరగడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా పరిపాలన అధికారి సాయినాథ్ రెడ్డి సూచించారు. శనివారం ఆయనతో పాటు జిల్లా వ్యాధి నిరోధక శాఖ అధికారి డాక్టర్ పరిమళ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం మండలంలోని తోమాలపల్లి గ్రామంలోని వ్యాధి నిరోధక టీకాల కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణీ మహిళలకు రక్త హీనత లేకుండా పౌష్టికాహారం పై అవగాహన కల్పించాలని. ప్రతి రోజు ఐరన్ మాత్రలు తీసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం అందే విధంగా చూడాలని, సాధారణంగా ప్రసవాలు జరిగేటట్టు చూడాలన్నారు. అప్పుడే పుట్టిన బిడ్డ నుండి ప్రతి చిన్న పిల్లలకు వ్యాక్సిన్ వెయ్యాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్య అధికారి డాక్టర్ రాకేష్ రెడ్డి, డాక్టర్ రాముడు, హెల్త్ సూపర్‌వైజర్ సూర్యనారాయణ, హెల్త్ అసిస్టెంట్ రాజశేఖర్, లక్ష్మిరెడ్డి, డేటా ఎంట్రీ ఆపరేటర్ రాజేష్ గౌడ్, ఏఎన్ఎం లావణ్య, ఆశకార్యకర్త చెన్నమ్మ, అంగన్వాడి కార్యకర్త విమల, ప్రజలు పాల్గొన్నారు.



## కక్ష్య సాధింపు చర్యలు మానుకోవాలి..

**-మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం**

**కల్వకుర్తి, జనవరి 13, ప్రభాతవార్త:** అవినీతి, ఆరోపణలతో బీఆర్ఎస్ సర్పంచ్‌లపై కాంగ్రెస్ నాయకులు కుట్రలు పన్ని కక్ష్య సాధింపుకు చేస్తున్న చర్యలను మానుకోవాలని కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం పేర్కొన్నారు. శనివారం కల్వకుర్తి పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో సర్పంచ్‌ల సమస్యలను పరిష్కరించాలి కానీ బీఆర్ఎస్ సర్పంచ్‌లపై అవినీతిని, అంటగట్టడం సమంజసం కాదని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత బడుగు, బలహీన వర్గాల సర్పంచ్‌లను టార్గేట్ చేసి అనేక ఒత్తిళ్లకు గురి చేస్తూ అవినీతి ఆరోపణలు మోపుతూ సస్పెండ్ చేయించడమేమిటని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సర్పంచ్‌ల సమస్యలను అర్థం చేసుకొని పెండింగ్‌లో ఉన్న బిల్లులను విడుదల చేయాలన్నారు. విలేకరుల సమావేశంలో వైస్ ఎంపీపీ కొండూర్ గోవర్ధన్, సర్పంచ్‌లు జంగయ్య, పద్మ, సీనియర్ నాయకులు ఈశ్వరయ్య, చెన్నకేశవులు, ఏలీషా, ఖాజా, గణేష్, సోమ్లు, భీమ్లా వెంకటయ్య, రాములు, వెంకటేష్ తదితరులు ఉన్నారు.



## మల్లురవిని కలిసిన కాంగ్రెస్ నేతలు

**వెల్దండ, జనవరి 13 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలన ఏర్పడి 30 రోజులు విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం టీపీసీసీ ఉపాధ్యక్షులు, మాజీ ఎంపీ మల్లురవిని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోతిలాల్‌నాయక్, తాలూకా కిసాన్ సెల్ అధ్యక్షులు పర్వత్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి శేఖర్, సేవాదల్ జిల్లా ఉపాధ్యక్షులు పుల్లయ్య, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాస్‌యాదవ్‌లు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా క్షేత్ర స్థాయిలో కాంగ్రెస్ పార్టీ అభ్యున్నతి కోసం నిరంతరం శ్రమించిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను గుర్తించి ప్రభుత్వ పథకాలతో పాటు ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో భాగస్వాములు చేసే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.



## పుష్యమాసంలో శనీశ్వర స్వామికి తిలతైల అభిషేక పూజలు ప్రీతికరం..

**బిజినేపల్లి, జనవరి 13 ప్రభాతవార్త :** పుష్యమి నక్షత్రం శనేశ్వరస్వామి వారికి ప్రీతికరమని, పుష్య మాసంలో శనేశ్వరస్వామిని భక్తులు పూజించడంతో గ్రహదోష నివారణ జరిగి విశేష పుణ్యఫలితం లభిస్తుందని శరీశ్వర ఆలయ ప్రధాన అర్చకులు గవ్వమఠం విశ్వనాథశాస్త్రి అన్నారు. శనివారం విదియనాడు శ్రీసార్థా సప్తజేష్ట మాత సమేత శనేశ్వర స్వామికి ప్రత్యేకంగా తిల అభిషేకాలు పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానఅర్చకులు డా. గవ్వమఠం విశ్వనాథశాస్త్రి మాట్లాడుతూ భక్తుల జన్మరిత్యా, గోచార రిత్యా గ్రహదోషాలు తొలగుటకు శనిగ్రహ శాంతికొరకు శనేశ్వరస్వామిని నువ్వుల నూనె, జిల్లెడు పూలు, జమ్మి ఆకులతో పూజించారని తెలిపారు. పరమ శివునికి భక్తులచే రుద్రాభిషేక పూజలు, అర్చనలు ప్రత్యేకంగా నిర్వహించినట్లు ఆయన వివరించారు. అనంతరం మహా గణపతి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు తెల్లవారు జాము నుండి స్వామివారికి ప్రత్యేకంగా అభిషేకాలు, అష్టోత్తర, అర్చనలు చేశారు. కార్యక్ర మంలో ఆలయ చైర్మన్ గోపాల్ రావు, గ్రామ సర్పంచ్ వంగ సుదర్శన్‌గౌడ్, ఆలయ కమిటి సభ్యులు వీరశేఖర్, ప్రభాకర్, పుల్లయ్య, ఆలయ అర్చకులు గవ్వమఠం శాంతికుమార్, ఉమామహేశ్వర్, జయంత్, సిబ్బంది గోపాల్‌రెడ్డి, భక్తులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





## భాషపై పట్టు సాధించాలి : జైపాల్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 13 ప్రభాతవార్త :** భాషలన్నింటికి మాతృభాష మూలమని విశ్వహిందూ పరిషత్ ఉపాధ్యక్షుడు జైపాల్‌రెడ్డి అన్నారు. సంస్కృత భారతి జడ్చర్ల శాఖ ఆధ్వర్యంలో మారుతినగర్ కాలనీలోని మాధవి భవనంలో గతరెండు రోజుల నుండి సంస్కృత సంభాషణ తరగతులను నిర్వహిస్తుంది. ఈ కార్యక్రమంలో ముఖ్యంగా జిల్లా విశ్వహిందూ పరిషత్ ఉపాధ్యక్షులు జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ భాషలన్నింటికి మాతృభాషా అని మనవేద పురాణ ఇతిహాసాలు రామాయణ మహాభారతాలు సంస్కృతంలోని రాయబడ్డాయని సంస్కృతం కేవలం భాష మాత్రమే కాదు వైజ్ఞానిక భాష అని తెలిపారు. సంస్కృత భారతి విభాగ్ ప్రముఖ్ బి.వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ సంస్కృతము సంపూర్ణ మానవీయ విలువలను పెంపొదిస్తుందని సంస్థలని ఆత్మని భారత వైజ్ఞానిక పరంపరకు తాళంచెవి లాంటిదని తెలిపారు. కార్యక్రమంలో సంస్కార భారతి గోనెల రాధాకృష్ణ మాట్లాడుతూ జ్ఞాపకశక్తి పెరుగుతుందని సంస్కారం నిలబడుతుందని తెలిపారు. కార్యక్రమాన్ని రెండు రోజులపాటు భాగ్యశ్రీ శిక్షకురాలుగా ఉండి విద్యార్థులకు చక్కటి శ్లోకాలను నాటకాలను సంస్కృతంలో చిన్నచిన్న పదాలను నేర్పించారు. కార్యక్రమంలో చిరంజీవులు, రాము, మహిళా మాతృశక్తి ప్రముఖ్ లావణ్య, విద్యార్థులు చివరగా శోభాయాత్ర కూడా నిర్వహించారు. శిబిరంలో ముప్పై మంది విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న వీహెచ్‌పి నాయకులు

## ఈనెల 26న శివమాలాధారణ ముహూర్తం..

**అడ్డాకుల, జనవరి 13 ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల మండల ప్రజలకు శివరాత్రి ఉత్సవాల సందర్భంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వీరశవ అర్చక పురోహిత సంఘం అధ్యక్షులు కన్మనూరు శివ శ్రీసురేష్ శాస్త్రి మాట్లాడుతూ ఆ పరమశివుణ్ణి ప్రసన్నం చేసుకొనుటకు ఆ శివయ్య భక్తులు స్వామివారిపై అపారమైన భక్తితో కఠోరమైన దీక్షను వీరశైవ సాంప్రదాయంలో ఎంతో ముఖ్యమైన పద్ధతులను దీక్షగా గురువులైన శైవ ఆలయాలలో శివయ్యకు రుద్రాభిషేకం చేసి దీక్షను మఠాధిపతులచే లేదా అర్చకులచే దీక్షను పూనుకుని 41 రోజులు అర్చకులు, గురుస్వాములు చెప్పిన విధంగా నియమ నిష్ఠలను పాటిస్తూ ఒక్కపూట భోజనం బిక్షగా స్వీకరించి వేకువజామున బ్రాహ్మి ముహూర్తంలో చన్నీటి స్నానం చేసి శివయ్యకు అభిషేకం చేసి శరణుఘోష వివిధమైన స్తోత్ర పారాయణములు పఠించి మధ్యాహ్నం సమయంలో స్నానంచేసి బిక్షను స్వీకరించడం తిరిగి గోధూళి సాయంకాలం సమయంలో తిరిగి స్నానం ఆచరించి పూజా కార్యక్రమం ఇలా 3 పూటలు చేస్తారు. సాయంత్రం పూజ ముగిశాక స్వామివారి, అమ్మవారి భజన కీర్తనలు పాడుతూ ఇలా 41 రోజులు చేసే శివదీక్ష కొనసాగించి తమలో ఉన్న కొంత చెడు వ్యసనాలను వదులుకుని ఈ జన్మను ఆ పరమేశ్వరునికి సమర్పిస్తున్న భావంతో 41 రోజులు దీక్షపూర్తయ్యే సరికి మహాశివరాత్రికి ఇరుముడితో శ్రీశైల క్షేత్రానికి కొంతమంది పాదయాత్రగా మరికొంతమంది వాహనాల ద్వారా చేరుకొని ఇరుముడి సమర్పించుకుని పాగదర్శనం చేసుకొంటారు. ఇలా ఈ సంవత్సరం దీక్షా సమయాన్ని శ్రీశైలం దేవస్థానం శివరాత్రికి ముందు మండల దీక్ష సమయాన్ని తెలిపినందున మనజిల్లా మండల శివదీక్ష స్వాములకు ఈ సమాచారాన్ని గురుస్వామి ఉమ్మడి పాలమూరు జిల్లా అధ్యక్షులు కన్మనూర్ శివ శ్రీసురేష్ శాస్త్రి మండల దీక్షా (41) రోజులు తేది. 26.01.2024 శుక్రవారం పాడ్యమి రోజున అర్ధమండల దీక్ష (21) రోజులు 16.02.2024 శుక్రవారం రథసప్తమి రోజున దీక్ష స్వీకరించాలని ఈ సంవత్సరం శివరాత్రి పండగ 08.03.2024 శుక్రవారం శివదీక్ష స్వాములకు తెలిపారు.



శివ శ్రీసురేష్ శాస్త్రి

## బిజెపి ఎంపి అభ్యర్థిగా శాంతికుమార్‌కు సీటు ఇవ్వాలి..

**శాంతికుమార్‌కే మా మద్దతు.. బిసి సేన జిల్లా అధ్యక్షుడు యాదన్న**

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 13 ప్రభాతవార్త :** వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి పాలమూరు ఎంపి అభ్యర్థిగా బిసి అయిన పాలమూరు శాంతికుమార్‌కు కేటాయించాలని బిసిసేన జిల్లా అధ్యక్షుడు యాదన్న డిమాండ్ చేశారు. జడ్చర్ల నియోజకవర్గ బిసి సేన అధ్యక్షుడు యాదన్న మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో పాలమూరు ఎంపి అభ్యర్థిగా బిసి సామాజిక వర్గానికి చెందిన పాలమూరు మోదీ బండారీ శాంతికుమార్‌కే కేటాయించాలని కోరారు. తాము బిసి సేన తరపున బిసి అభ్యర్థి పాలమూరు మోదీ శాంతికుమార్‌కు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా బిజెపి పార్టీకి మద్దతు ఇస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా బిజెపి పార్టీపై తమకు పూర్తి నమ్మకం, విశ్వాసం ఉందని, ఎందుకంటే పోయిన అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి పార్టీ బిసి అభ్యర్థిని సీఎంగా చేస్తామని చెప్పింది. అందులో భాగంగా రేపు జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పాలమూరు అభ్యర్థిగా రెండుసార్లు రెడ్డి సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థుల కోసం తన సీట్‌ని త్యాగం చేసిన శాంతికుమార్‌కే పాలమూరు సీటు కేటాయించాలని కోరారు. బిసి నాయకుడైన బిజెపి రాష్ట్ర కోశాధికారి బండారి శాంతికుమార్ ఎంపి పదవికి ముమ్మాటికి అర్హుడైన వ్యక్తి అని గత రెండు పార్లమెంట్ ఎన్నికలలో చివరి క్షణంలో శాంతికుమార్‌కు కేటాయించిన ఎంపి సీటును పార్టీ ఆదేశాల మేరకు త్యాగం చేశారని గుర్తు చేశారు. 2014 ఎన్నికల్లో అప్పుడే పార్టీలో చేరిన రెడ్డి సామాజిక వర్గానికి చెందిన డికె అరుణ కోసం శాంతికుమార్ పార్టీ ఆదేశాలను శిరసావహిస్తూ పోటీకి దూరంగా ఉన్నారని తెలిపారు. పార్టీ హై కమాండ్ కూడా ఈ విషయంలో శాంతికుమార్‌కు తగిన న్యాయం చేయాలని కోరుతున్నట్లు పేర్కొన్నారు. మొన్నటి ఎన్నికల్లో బిసి సీఎం అని ప్రకటించిన బిజెపి పార్టీ, ఎంపి ఎన్నికల్లో బిసి జనాభా ఎక్కువ ఉన్న పాలమూరు పార్లమెంట్ సీట్ బిసిలకు కేటాయించి తమ మాట నిలబెట్టుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బిసి సేన కార్యదర్శి బందర్పల్లి శంకర్, కిష్టారం శేఖర్ ముదిరాజ్, కుర్మన్న, యూత్ అధ్యక్షుడు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న యాదన్న

## సీతారాముల చిత్రపటాలతో అక్షింతలు గ్రామ పురవీధుల్లో ఊరేగింపు

**రాజాపూర్, జనవరి13 ప్రభాతవార్త:** అయోధ్యలో నిర్మాణం జరుగుతున్న శ్రీరా ముని దివ్యభవ్య మందిర ప్రారంభోత్సవం జనవరి 22న జరగనున్న నేపథ్యంలో ఈ వేడుకలను ప్రతి ఇంట జరుపుకునే విధంగా రామ సేవకులు పని చేస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య రామాలయం నుంచి బలరాముని పూజలో ఉపయో గించిన అక్షింతలు రాజాపూర్ మండల పరిధిలోని అన్ని గ్రామాలలో ఇంటింటికి అందజేస్తున్నారు. శనివారం రాజాపూర్ మండల కేంద్రంలో సీతారామాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి సీతారాముల చిత్రపటాలతో పా టు అయోధ్య బలరాముడి పూజలో ఉపయోగించిన అక్షింతలు గ్రామ పురవీధు ల్లో ఊరేగింపు అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం ఇంటింటికి తిరు గుతూ రాముల వారి గుడి నిర్మాణ చిత్రపటం అక్షింతలు ఇంటింటికి పంపిణీ చేశా రు. ఈ సందర్భంగా పలువురు గ్రామ పెద్దలు మాట్లాడుతూ, జనవరి 22 బలరా ముడి మందిరం ప్రారంభోత్సవం సందర్భంగా ప్రతి హిందూ తమ తమఇళ్లలో ఉన్న దేవుడి గుడిలో ఇంటి ఆవరణలో తులసి మొక్క దగ్గర దీపాలు వెలిగించాలని భక్తి శ్రద్ధలతో శ్రీరామనామం స్మరించాలని భగవంతుని కృప కరుణ కటాక్షాలు అందరిపై ఉండాలని భగవం తునిపై నమ్మకంతో భక్తిగా పూజించాలని ఎలాంటి కష్టాలు వచ్చినా భగవంతుని నమ్మిన వారికి మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షులు కప్పిరి బుచ్చిరెడ్డి, మాజీ ఎంపిపి నర్సింలు, దేవాలయ కమిటి సభ్యులు వనపర్తి కృష్ణయ్య, గుమ్మడివెల్లి అచ్చయ్య, గ్రామ పెద్దలు, వివిధ పార్టీల నాయకులు, వివిధ యువజన సంఘాల సభ్యులు గ్రామస్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



అయోధ్య రామయ్య అక్షింతలు ఊరేగిస్తున్న దృశ్యం

## క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

**నవాబ్‌పేట, జనవరి 13 ప్రభాతవార్త :** మండల కేంద్రంలో నిర్వహించిన నవాబ్‌పేట ప్రీమియర్ లీగ్ సీజన్ 2 ఎన్‌పిఎల్ 2 క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా డిసిసి మాజీ అధికార ప్రతినిధి జనుంపల్లి దుష్యంతరెడ్డి ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను ఉద్దేశించి క్రీడలు మానిక ఉల్లాసానికి శరీర దృఢత్వానికి ఆరోగ్యమే మహాభాగ్యం అనే విషయానికి ఈ క్రీడలే ప్రాముఖ్యత వహిస్తాయని తెలిపారు.



టోర్నమెంట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

## యువత క్రీడలపై ఆసక్తిని పెంపొందించుకోవాలి

**- ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి**





**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 13 ప్రభాతవార్త:** క్రీడల వల్ల మానసిక ఉల్లాసం, దేహదారుఢ్యం, మానసిక ఉల్లాసం పెరుగుతుందని, యువత క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన జమ్ముల సతీష్‌రెడ్డి ఫౌండేషన్ క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజేష రెడ్డి పాల్గొని విజేతలకు బహుమతులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని, నేటి ఓటమి రేపటి గెలుపుకు నాంది అని సూచించారు. ఓడిన క్రీడాకారులు ఆత్మస్థైర్యాన్ని కోల్పోకుండా రానున్న రోజుల్లో మరో ఆటలో విజయం సాధించేందుకు కృషి చేయాలని ఆయ పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## కుటుంబ సమేతంగా శ్రీశైల మల్లన్నను దర్శించుకున్న ఎమ్మెల్యే



**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 13 ప్రభాతవార్త:** కర్నూల్ జిల్లా శ్రీశైల పుణ్యక్షేత్రంలో వెలిసిన శ్రీశైల మల్లన్న బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం ఉదయం నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డిలు కుటుంబ సమేతంగా స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి సన్మానించి తీర్థప్రసాదాలను అందించారు.

## అంగన్వాడీ కేంద్రాల్లో సంక్రాంతి సంబరాలు



**వీపనగండ్ల, జనవరి 13, ప్రభాతవార్త :** సంక్రాంతి పండుగ సందర్భంగా వివిధ గ్రామాలలో అంగన్వాడీ సెంటర్లలో చిన్న పిల్లలకు సంబరాలు నిర్వహించి వారికి వివిధ రకాలైనటువంటి పోషక పదార్థాలతో కూడిన వంటకాలను అందించారు. మండల కేంద్రంలోని నాలుగవ అంగన్వాడీ సెంటర్లో సంక్రాంతి పండగ సందర్భాన్ని పురస్కరించుకొని చిన్నారులకు చదువుల తల్లి సరస్వతి ఆశీస్సులు ఉండాలని కోరుతూ రేగిపళ్ళతో చిన్నారులను అంగన్వాడీ టీచర్లు ఆయాలు ఆశీర్వదించారు. చిన్నారులు చదువులో రాణిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరుతూ స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు సుగుణ భాయ్. సువర్ణ. మహేశ్వరి హెల్పర్లు ఈశ్వరమ్మ. లచ్చమ్మ. పలువురు చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## అయోధ్య రామ జన్మభూమి అక్షింతలు పంపిణీ



**కొత్తకోట, జనవరి 13, ప్రభాతవార్త :** కొత్తకోట మండలం నాటువెల్లి పెద్ద తండాలో శనివారం తండా నాయకులు ఇంటింటికి తిరిగి అయోధ్య రామ జన్మభూమి మందిర అక్షింతలను పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దేవి లక్ష్మణ్ నాయక్, మాజీ ఎంపిటిసి కిషన్ నాయక్, నారాయణ నాయక్, వెంకటయ్య, జాంపంలా నాయక్, దక్షిణ నాయక్, శంకర్ నాచక్, రాజు నాయక్, యూత్ మిత్రులు తాండ పెద్ద మనుషులు పాల్గొన్నారు.

## ఇంటర్నేషనల్ కైట్ ఫెస్టివల్ ప్రారంభించిన మంత్రి



**కొల్లాపూర్, జనవరి 13 ప్రభాతవార్త :** పరేడ్ గ్రౌండ్‌లో అంగరంగ వైభవంగా మంత్రి జూపల్లి కృష్ణారావు, మంత్రి పొన్నం ప్రభాకర్ కైట్ స్వీట్ ఫెస్టివల్ ప్రారంభించారు. ఫెస్టివల్‌లో ఈ ఫెస్టివల్లో వివిధ దేశాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

## వృషభరాజుల పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే...

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 13, ప్రభాతవార్త:** తాడూర్ మండల కేంద్రంలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రతి యేడాది వృషభరాజుల బండ లాగుడు పోటీలు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై వృషభరాజుల బండ లాగుడు పోటీలను ప్రారంభించి మాట్లాడారు. ప్రతి యేడాది సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని బండ లాగుడు పోటీలు నిర్వహించుకోవడం అనవాయితీగా వస్తుందని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంతమైన వాతావరణంలో పోటీలు నిర్వహించుకోవాలని ఆయన సూచించారు. అంతర్ రాష్ట్ర ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని నలుమూలల నుంచి వృషభరాజుల బండ లాగుడు పోటీలకు రైతులు పోటీ దారులు తమ ఎద్దులను తీసుకొని తాడూర్ మండలానికి సంక్రాంతికి పండుగకు ముందు చేరుకొని పోటీల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. బండలాగుడు పోటీలకు హాజరైన ఎమ్మెల్యేను పలువురు శాలువాలతో సన్మానించారు. అదే విధంగా ఎమ్మెల్యేగా గెలుపొంది మండలానికి విచ్చేసిన ఎమ్మెల్యేను మైనార్టీ సోదరులు మర్యాద పూర్వకంగా కలిసి మస్జిద్‌లో సన్మానించి స్వీట్లు తినిపించి మత గురువులు ఆశీర్వదించారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు తదితరులు ఉన్నారు. అంగరంగా వైభవంగా లక్ష్మినర్సింహ్మా స్వామి కళ్యాణోత్స వందాస్‌పల్లి గ్రామంలోని అప్పద్రి శ్రీ లక్ష్మి నర్సింహ్మా స్వామి సామూహిక వ్రత పూజా అంగరంగా వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి పూజా కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, నిర్వాహకులు ఎమ్మెల్యేను శాలువాలతో ఘనంగా సన్మానించారు.



వృషభరాజు బండ లాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

## ఆర్టీసి బస్సు ఢీకొని యువకుడు మృతి..!

**బిజినేపల్లి, జనవరి 13 ప్రభాతవార్త :** మంగనూరు గ్రామంలో శనివారం ఉదయం ఆర్టీసి బస్సు బైక్‌ను ఢీకొన్న ప్రమాదంలో యువకుడు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన జాలం నగేష్ (30) సొంత బైక్‌పై మహబూబ్‌నగర్ వైపు వెళ్తుండగా వెనకాలే వస్తున్న ఆర్టిసి బస్సు అతని బైక్‌ను ఢీకొట్టింది. ఈప్రమాదంలో నగేష్ తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామంలో వెల్డింగ్ పనులు చేస్తూ జీవనం సాగించే నగేష్ గత ఏడాది సెప్టెంబరు మూడున కోయిల్‌కొండ మండలం దుప్పట్లగట్టు గ్రామానికి చెందిన మమతతో వివాహం జరిగినట్లు గ్రామస్తులు తెలిపారు. నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డా. రాజేష్‌రెడ్డి ఏరియా ఆసుపత్రిలో నగేష్ మృతదేహాన్ని పరిశీలించారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తానని చెప్పారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.



నరేష్ (ఫైల్)

## క్రీడలు శరీర దారుఢ్యానికి దోహదపడతాయి:ఎస్సై రవి ప్రకాష్



**వీపనగండ్ల, జనవరి 13, ప్రభాతవార్త :** యువకులకు శరీర దారుణ్యానికి క్రీడలు ఎంత దోహద పడతాయని వీపనగండ్ల ఎస్సై రవి ప్రకాష్ అన్నారు. మండలం లోని సంగినేనిపల్లి గ్రామంలో ఇంద్రకంటి చారిటబుల్ ట్రస్టు ఆధ్వ ర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా శుక్రవారం నాడు వాలీబాల్ క్రికెట్ ఆటల పోటీలను ఆ ట్రస్టు చైర్మన్ ఇంద్రకంటి వెంకటేష్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిధిగా వీపనగండ్ల ఎస్సై రవి ప్రకాష్ హాజరై క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో యువకులు త్రాగుడుకు బాని పై కుటుంబ సమస్యలను మర్చిపోయి వారి యొక్క స్థితిగతులను తెలుసుకొనే పరిస్థితులు లేకుండా మద్యానికి బానిసలు అవుతున్న ఈ సందర్భంలో ఇలాంటి ట్రస్టు ఆధ్వర్యంలో క్రీడలు నిర్వహించడం ఎంతో సంతోషదాయకమని ఆయన అన్నారు. క్రీడలు అనేది శరీరానికి ఎంత దోహదపడతాయని వాటి వలన జ్ఞాపకశక్తి కూడా పెరుగుతుందని అంతేకాక ఆహ్లాదాన్ని కూడా ఇస్తాయని ఆయన తెలిపారు. ప్రతి గ్రామంలో ఇలాంటి క్రీడలు నిర్వహించాలని ఆయన యువకులను కోరారు. అంతేకాక సంక్రాంతి పండుగ సందర్భంగా యువతలకు ముగ్గులు పోటీలు కూడా ఏర్పాటు చేయాలని ఆ రకంగా ప్రతి ఒక్కరిని సంతోషమైనటువంటి ఆహ్లాదం ఇచ్చే విధంగా గ్రామీణ ప్రాంతాలు ఉండాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సైతో పాటు సంగినేనిపల్లి ఎంపీటీసీ వనపర్తి జిల్లా ఎంపిటిసిల అధ్యక్షుడు అయిన ఇంద్రకంటి వెంకటేష్ ఆ గ్రామ సర్పంచ్ ఆర్ మౌలాలి ఉప సర్పంచ్ లక్ష్మణ్ మండల రైతు బంధు అధ్యక్షుడు మాజీ ఎత్తం కృష్ణయ్య రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు నారాయణరెడ్డి రామిరెడ్డి సుదర్శన్ రెడ్డి పందెం విజయభాస్కర్ రెడ్డి మాజీ సర్పంచ్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గోదల బీరయ్య యాదవ్ కల్వరళ్ళ వెంకటేష్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మున్నూరుకాపులకు అండగా ఉంటా...

**-ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 13 ప్రభాతవార్త:** మున్నూరుకాపు కులస్థులకు అండగా ఉండి వారి అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని మున్నూరు కాపు ఫంక్షన్‌హాల్‌లో ఆ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే సంఘ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. మున్నూరుకాపు సంఘం అధ్యక్షులు తీగల సుభాష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలకు సముచిత స్థానాన్ని కల్పిస్తుందన్నారు. కులమతాలకతీతంగా సమాజంలోని అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. జిల్లా ప్రాంతంలో మున్నూరు సమాజానికి ఏ అవసరం ఉన్న ప్రభుత్వం ద్వారా అందించేందుకు పథకాలు ఏవి ఉన్న తన దృష్టికి తీసుకొని రావాలన్నారు. మీ అందరి సహకారంతో నాగర్‌కర్నూల్ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసి పేరు ప్రతిష్టలు తీసుకొద్దామని పిలుపునిచ్చారు. అనంతరం ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సతీష్‌కుమార్, కోశాధికారి జగదీష్‌లతో పాటు సంఘం సభ్యులు తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి



# మాడల్ రైతు వేధికగా కొండారెడ్డిపల్లి..

**-వ్యవసాయ సాగు సలహాలు,**
**సూచనలకు వీడియో కాన్ఫరెన్స్‌కు ఏర్పాటు**
**-జిల్లాలోనే ఎంపికైన కొండారెడ్డిపల్లి రైతువేధిక**

**వంగూరు, జనవరి 13 ప్రభాతవార్త:** ప్రతి 5వేల ఎకరాలకు ఒక రైతు వేధికను నిర్మించి వ్యవసాయ విస్తరణ సాగుపై అవగాహన కల్పించేందుకు అనువుగా రైతులందరిని ఒకే వేధికపైకి తరలించేందుకు రైతు వేధికను కేంద్రాలుగా మార్చారు. ఖరీఫ్, రబీ సాగులో రైతులు ఎలాంటి పంటలు సాగు చేయాలో, రైతులు లాభపడే విధంగా పంటలు సాగు చేసుకునేందుకు అధికారులు సలహాలు, సూచనలు అందించి రైతులను లాభాల బాటలో నడిపించేందుకు కృషి చేస్తారు. పంట సాగుపై తెలుసుకోవాల్సిన విషయాలు ఏ సమయంలో ఎలాంటి విత్తనాలు వేయాలో, వేసిన విత్తనాలకు ఏ సమయంలో ఎరువులు, రసయానాలు వాడాలో రైతులకు వ్యవసాయాధికారులు సలహాలు, సూచనలు అందిస్తారు. పొలాలకు సంబంధించిన భూసార పరీక్షలు రైతులు పంటలు వేసుకునే విధంగా వ్యవసాయా ధికారులు సలహాలు, సూచనలు చేసి రైతులను ప్రొత్సహించేందుకు రైతు వేధికలు వేధికగా మారుతున్నాయి. శిక్షణకు వచ్చే రైతులకు భోజన వసతులు కల్పించి తెలంగాణ వ్యాప్తంగా 2600 రైతు వేధికలు, 572 కోట్ల నిధులతో నిర్మించారు. రైతు వేధికలో కుళాయి నీరు, విద్యుత్, ఫర్నిచర్ నిర్వహణ ఖర్చు ప్రభుత్వం భరిస్తోంది. ప్రభుత్వం ఐటీఈపీఈ విభాగం ద్వారా ఫైబర్ ద్వారా వేధికలను కన్సెల్టింగ్ చేయాలనుకుంటోంది. ఫైలెట్ ప్రాజెక్టుగా జిల్లాకు ఒక్కొటి చొప్పున ఎంపిక చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి స్వగ్రామమైన కొండారెడ్డిపల్లిలో ఉన్న రైతు వేధికను నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి ఫైలెట్ ప్రాజెక్ట రైతు వేధికగా ఎంపిక చేశారు. ఫైలెట్ ప్రాజెక్ట క్రింద ఎంపికబడిన రైతు వేధికలకు రూ.3.75లక్షల నిధులను కేటాయించారు. దీనికి తోడు సీఎం రేవంత్‌రెడ్డి సొంత గ్రామంలోని రైతు వేధిక మరింత ఆదర్శంగా నిలువడానికి తీర్చిదిద్దుకునే విధంగా వంగూరు మండల జెడ్పీటీసీ, పీసీసీ సభ్యులు కేవీఎన్‌రెడ్డి మరో రూ.10లక్షలు మంజూరుకు అభ్యర్థించారు. రైతు వేధిక ప్రాంగణంలో పూల మొక్కలు, నీటివసతి కల్పించేందుకు డ్రిప్ ఏర్పాటు, వేధికకు పశువులు రాకుండా ప్రహరిగోడ నిర్మాణం, పెన్షన్, సీసీకెమెరాలు ఏర్పాటు చేయుటకు అదనపు నిధులు, మంజూరు కావాల్సిన అవశ్యకత ఉంది.




ఫైలెట్ ప్రాజెక్టు క్రింద ఎంపికైన రైతు వేధిక

**రైతు వేధికతో రైతన్నకు మేలు...**

**-సర్పంచ్ కాయితీ భారతమ్మ**



రైతు వేధికల ద్వారా రైతన్నలకు మేలు జరుగుతుందని, రైతులు పండించే పంటలపై అవగాహన కల్పించి రైతులు అభివృద్ధి చెందేందుకు అధికారులు, శాస్త్ర వేత్తలు సలహాలు, సూచనలు అం దిస్తూ రైతు వేధికల ద్వారా రైతు లందరిని ఒకే వేధికకు చేర్చి వ్యవ సాయ సాగుపై పలు చర్చలు కొన సాగిస్తూ రైతన్న అభివృద్ధికి దోహద పడుతాయని కొండారెడ్డిపల్లి సర్పంచ్ కాయితీ భారతమ్మ పేర్కొన్నారు.

**ఫైలెట్ ప్రాజెక్టు రైతు వేధికతో రైతులకెంతో మేలు...**

**-ఏఈఓ ప్రేమ్‌కుమార్**



కొండారెడ్డిపల్లి గ్రామంలోని రైతు వేధికను రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా చేపటిన ఫైలెట్ ప్రాజెక్టు క్రింద ఎంపిక చేసింది. జిల్లా రైతన్నలకు ఫైలెట్ రైతు వేధికలో రాష్ట్ర ముఖ్యమంత్రి, ప్రముఖ శాస్త్ర వేత్తలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వ్యవసాయ సాగుపై సలహాలు, సూచన లు ఏ సమయంలో ఎలాంటి పంటను సాగు చేస్తే అధిక దిగుబడు లు వస్తాయో సాగు చేసిన పంటలకు ఎలాంటి రసయాన ఎరువులు వాడాలో తెలిపేందుకు 15రోజులకొకసారి వీడియో కాన్ఫరెన్స్ ద్వా రా తెలుపుతారని, దీంతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని కొండారెడ్డిపల్లి ఏఈఓ ప్రేమ్‌కుమార్ తెలిపారు.

## జాతీయ రహదారిపై అదుపు తప్పి బస్సు బోల్తా..!

**షాట్ సర్క్యూట్‌తో బస్సులో చెలరేగిన మంటలు**

**ప్రమాదంల మహిళ మృతి ఏడుగురికి స్వల్ప గాయాలు కర్నూలు ఆసుపత్రికి తరలింపు**

**పోలీసుల తక్షణ చర్యలతో తప్పిన బారీ ప్రాణనష్టం:జిల్లా ఎస్పీ రితిరాజ్**

**గద్వాల ప్రతినిధి, జనవరి 13 ప్రభాతవార్త :** శనివారం తెల్లవారుజామున బీచుపల్లి దగ్గర జాతీయ రహదారి 44పై ప్రైవేట్ ట్రావెల్ బస్సు అదుపు తప్పి బోల్తా పడగ షాట్ సర్క్యూట్‌తో మంటలు అంటుకుని దగ్ధమైన ప్రమాదంలో ఒక మహిళ మృతి చెందగా ఏడుగురికి స్వల్ప గాయాలయ్యాయని డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదంలో జరిగినట్లు జిల్లా ఎస్పీ రితిరాజ్ తెలిపారు. అందుకు సంబంధించిన వివరాలు ఎస్పీ ఒక ప్రకటన చేశారు. శుక్రవారం రాత్రి 11 గం.లకు హైదరాబాద్ నుంచి 37 (32) మంది ఆన్‌లైన్ బుకింగ్, 5గురు ఆరంఘర్ చౌరస్తా దగ్గర ఎక్కారు. ప్రయాణీకులతో చిత్తూరుకు ఇద్దరు డ్రైవర్లతో బయలుదేరింది. హైదరాబాద్ నుండి జడ్చర్ల మునవర్ దాబా వరకు ఒక డ్రైవర్ ఉన్నాడు. తరువాత మధ్యరాత్రి 1 గం. సమయంలో రెండో డ్రైవర్‌కి ఇవ్వడం జరిగింది. అయితే రెండవ డ్రైవర్ బీచుపల్లి దాటిన తర్వాత పదవ బెటాలియన్ సమీపంలో శనివారం తెల్లవారుజామున 2.30 గం.ల సమయంలో బస్సు అదుపుతప్పి ఎన్‌హెచ్ 44 రోడ్డు ఎడమవైపుకు పడిపోయింది. వెంటనే సమాచారం అందుకున్న ఇటిక్యాల పోలీస్ స్టేషన్ బ్లూ కోట్స్ సిబ్బంది అయిన కె. ప్రవీణ్, పిసి బి వరదరాజు హైవే సిబ్బంది సంఘటన స్థలంకు వెంటనే చేరుకుని, వారు ఇటిక్యాల ఎస్సై పి. అశోక్‌బాబుకు, అలంపూర్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ డి. రాజుకు, పి. వెంకటేశ్వర్లు డీఎస్పీ గద్వాలకు సమాచారం అందించగా వెంటనే వారు కూడా అక్కడికి చేరుకుని బస్సులో ఉన్న ప్రయాణీకులను (36 మందిని) సురక్షితంగా బయటకు తీయడం జరిగింది. అందరిని కూడా కాపాడే ప్రయత్నం చేసినప్పటికి ఒక మహిళ బస్సు కింద ఇరుక్కుపోవడంతో అప్పటికే మెల్ల మెల్లగా ఏసి షాట్ సర్క్యూట్‌తో బస్సుకు మంటలు చెలరేగాయి. అందులో ఓ మహిళ సజీవ దహనం అయి అక్కడికక్కడే చనిపోయారు. తరువాత తోటి ప్రయాణీకుల ద్వారా అక్కడకువచ్చిన వారి కుటుంబ సభ్యుల ద్వారా మరణించిన మహిళను మెహిదీపట్నం హైదరాబాద్‌కు చెందిన మాలతి మారుతి శ్రీనివాసులు (40)గా గుర్తించడం జరిగింది. ఈ ప్రమాదంలో స్వల్ప గాయాలతో బయటపడ్డ ఏడుగురు ప్రయాణీకులను చికిత్స నిమిత్తం కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగిందని ఇటిక్యాల పోలీసులు, హైవే పెట్రోలింగ్ పోలీసులు వెంటనే స్పందించి ప్రయాణీకులను బయటకు తీయడం ద్వారా భారీ ప్రాణనష్టాన్ని నివారించగలిగారని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేయడం జరిగిందని, డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్లు ఎస్పీ తెలిపారు. ప్రమాదంలో ప్రయాణీకులలో అరుణ అనే మహిళ 10 తులాల బంగారం ఉన్న తనచేతి సంచిని మరిచిపోగా పోలీస్‌వారు ఆ ప్రదేశంలో వెతికి కాలిన బంగారంను ప్రయాణికురాలు అరుణ, ఆమె కుమారుడు భార్గవ్‌లకు అప్పగించడం జరిగిందని జిల్లా ఎస్పీ తెలిపారు.



జిల్లా ఎస్పీ రితిరాజ్

## వట్టెం వాసికి ఆల్ ఇండియా 33వ ర్యాంక్..

**సివిల్స్‌లో ప్రతిభ కనబర్చిన మూసాపేట హనుమంతు**

**అభినందించిన గ్రామస్తులు చైతన్య యోజన సంఘం సభ్యులు**

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 13 ప్రభాతవార్త :** యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన పరీక్షలో ఆల్ ఇండియా స్థాయిలో మూసాపేట హనుమంతు 33వ ర్యాంకు సాధించాడు. ఉమ్మడి మహబూబ్‌నగర్‌కు చెందిన నాగర్‌కర్నూల్ జిల్లా వట్టెం యువకుడు మూసాపేట హనుమంతు ఆల్ ఇండియా స్థాయిలో 33వ ర్యాంక్ సాధించి తన ప్రతిభను చాటాడు. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ప్రభుత్వ బాలల పాఠశాల, ఆరు నుంచి పదవ తరగతి వరకు వట్టెం జడ్పీ హైస్కూల్‌లో విద్యాభ్యాసం చేశాడు. ఇంటర్, డిగ్రీని మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎంవిఎస్ ప్రభుత్వ కళాశాలలో పూర్తి చేశాడు. ఉత్తరప్రదేశ్‌లోని బనారస్ హిందూ యూనివర్సిటీలో జియోలాజి పిజి పూర్తి చేశాడు. అనంతరం యుపిఎస్‌సికి శిక్షణ పొందాడు. అయితే ఇటీవల విడుదలైన యూపీఎస్సీ ర్యాంకుల్లో ఆల్ ఇండియా స్థాయిలో 33వ ర్యాంక్ సాధించడంపై గ్రామస్తులతో పాటు జిల్లా వాసులు అభినందించారు.

**చైతన్య యోజన సంఘం సన్మానం...** కొట్టెం గ్రామానికి చెందిన హనుమంతు యూపీఎస్‌సిలో ర్యాంక్ సాధించడంపై గ్రామస్తులు అభినందించారు. చైతన్య యోజన సంఘం సభ్యులు శనివారం హనుమంతును సన్మానించారు. తమ గ్రామానికి చెందిన యువకుడు జాతీయ స్థాయిలో ర్యాంకు పొందడం తమకు ఎంతో సంతోషాన్నిచ్చిందని పేర్కొన్నారు. హనుమంతు ఎంతో మంది యువకులకు స్పూర్తినిచ్చాడని ఈ సందర్భంగా తెలిపారు.



హనుమంతును అభినందిస్తున్న వట్టెం చైత్య యువజన సంఘం సభ్యులు

## సంక్రాంతి సంబరాలలో పాల్గొన్న మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

**ముగ్గుల పోటీ విజేతలకు బహుమతులు ప్రదానం..మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి**





**వనపర్తి ప్రతినిధి, జనవరి 13, ప్రభాత వార్త :** జిల్లా కేంద్రంలోని 29వ వార్డులో శనివారం సంక్రాంతి పండుగ సందర్భంగా గోపీనాథ్ జువెలర్స్ అధినేత గోపీనాథ్ గాయిత్రి దంపతులు ముగ్గుల ఫోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమం కు ముఖ్య అతిధిగా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పాల్గొని మహిళలతో, కాలని పెద్దలలో కలసి తిలకించారు. అక్కడ ఉన్న చిన్నారులతో కలిసి సరదాగా గడిపారు. ఈ ముగ్గుల పోటీలను కౌన్సిలర్ భారతి ప్రేమ్ నాథ్ రెడ్డి పర్యవేక్షణలో జరిగింది. జడ్జీలుగా పోచ. రవీందర్ రెడ్డి, శ్రీలత, ఇనదుశ్రీ రాజేందర్ వ్యవహరించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సంస్కృతికి సంప్రదాయాలకు ప్రతీక అని ఈ ముగ్గులు చూస్తుంటే గ్రామీణ అభినందించారు. ఈ పోటీల్లో మొదటి బహుమతి కీర్తి, రెండవ బహుమతి శ్రీలత, మూడవ బహుమతి రజిత లకు అందజేశారు. పోటీలో పాల్గొన్న అందరికీ ప్రోత్సాహకరంగా బహుమతులు అందజేశారు. అనంతరం పోటీలు ఘనంగా నిర్వహించిన నిర్వాహకులను ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, బండారు. కృష్ణ, రంజిత్ రెడ్డి, రమేష్ చంద్ర, సయ్యద్, జేమీల్, యుగంధర్ రెడ్డి, ముద్దుసర్, నందిమల్ల. సబ్బు, ఇంతియాజ్, రమేశ్ కాలనీవాసులు పాల్గొన్నారు.





ముగ్గుల పోటీలో వేసిన ముగ్గులను తిలకిస్తున్న మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

## చిరుత మృత్యువాత.. అనారోగ్యమా ఇతర కారణాలా...?

**మొదటి పేజీ తరువాయి భాగం..**

కదలలేకపోవడంతో స్థానికులు గమనించి పెద్ద ఎత్తున వచ్చి చూసేందుకు ప్రయత్నించారు. యువకులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున సెల్ఫీలు దిగి సోషల్ మీడియాలో పోస్టులు వైరల్ చేశారు. నిస్సహాయ స్థితిలో ఉన్న చిరుతను చూసి గ్రామస్తులు అటవిశాఖ పోలీసు అధికారులకు సమాచారం ఇచ్చారు. ఇదిలా ఉండగా చిరుత అదే ప్రాంతంలో ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. అక్కడికి వెళ్లి గమనించిన దామరగిత ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి, ఫారెస్టు అధికారి సంతోష్, లక్ష్మణ్‌నాయక్, సిబ్బంది ఆరోన్ నరహరి ఘటన స్థలాన్ని పరిశీలించారు.

## గంధం ఆంజనేయులు జ్ఞాపకార్థం సందర్భంగా కబడ్డి టోర్నమెంట్



**వనపర్తి టౌన్, జనవరి 13, ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలో హరిజనవాడలో సంక్రాంతి పండుగ సందర్భంగా కీర్తిశేషులు గంధం ఆంజనేయులు జ్ఞాపకార్థం కబడ్డీ టోర్నమెంట్ క్రీడలు కర్రెమ్మ గుడి దగ్గర ఏర్పాటు చేయడం జరిగింది. నిర్వహించిన వారు ఆత్మీయ అభిమాన బృందం గంధం చరణ్ ఆధ్వర్యంలో కబడ్డీ క్రీడలు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ నెంబర్ గంధం నాగరాజు కాంగ్రెస్ పార్టీ వనపర్తి అసెంబ్లీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ ద్యారపోగు వెంకటేష్ దళిత అభివృద్ధి సంఘం జిల్లా అధ్యక్షులు ద్యారపోగు రవి ప్రసాద్ బంకలి ఆంజనేయులు గంధం బుచ్చన్న గంధం ఆంజనేయులు డి సురేందర్ కే నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతోనే మానసిక ప్రశాంతత..



**బిజినేపల్లి, జనవరి13 ప్రభాతవార్త:** క్రీడలతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ప్రతి ఒక్కరు ఖాళీ సమయంలో క్రీడలపై దృష్టి సారించాలని సర్పంచ్ వెంకటయ్య అన్నారు. లట్టుపల్లి గ్రామ పంచాయీ మాజీ సర్పంచ్ హన్యనాయక్ జ్ఞాపకార్థం మైల్డ్‌స్టోన్ యూత్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. పలువురు క్రీడాకారులు మాట్లాడుతూ ప్రస్తుత సెల్‌ఫోన్ యుగంలో యువత పెడదోవ పట్టకుండా అవసరాల మేరకే సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని సూచించారు. ప్రతి ఒక్కరిలో క్రీడా నైపుణ్యం వెలికి తీసేందుకే క్రీడా పోటీలు పెట్టినట్లు చెప్పారు. అందరిలో క్రీడా స్పూర్తిని పెంపొందించుకోవాలన్నారు. క్రీడాకారులు పోటీల్లో గెలుపోటములు సమానంగా స్వీకరించాలని సూచించారు. శ్రీనివాస్‌రెడ్డి, చంద్రగౌడ్, గోవిందు నాయక్, శ్రీనునాయక్, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, పాండురాజు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ...

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 13, ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నాగేష్ కుటుంబాన్ని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో పరామర్శించి మనోధైర్యాన్ని కల్పించారు. నాగర్‌కర్నూల్ జిల్లా మంగనూర్ గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నాగేష్ తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి ఆసుపత్రికి చేరుకొని కుటుంబ సభ్యులను ఓదార్చి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు నేతలు తదితరులు ఉన్నారు.

## వాచర్ బయ్యన్న కుటుంబానికి ఆర్థిక సాయం

**లింగాల, జనవరి 13 ప్రభాతవార్త :** ఫారెస్టు వాచర్ బయ్యన్న భార్య ఇద్దరు పిల్లలు మృతి చెందిన సంఘటనలో బాధిత కుటుంబానికి ఫారెస్టు అధికారులు, వనరక్షణ సేవా సమితి వారు పరామర్శించి శనివారం ఆర్థిక సహాయం అందించారు. లింగాల మండలంలోని రాంపూర్ పెంటలో ఫారెస్టు వాచర్ బయన్న భార్య నాగమ్మ ఇద్దరు పిల్లలను హత్యచేసి తాను ఆత్మహత్య చేసుకున్న సంఘటనలో బాధిత కుటుంబానికి అత్యవసర సహాయం కింద ఫారెస్టు అధికారులు రూ. 5 వేలు, వనరక్షణ సేవా సమితి ఆధ్వర్యంలో రూ. 15వేలు మొత్తం రూ. 20 వేలు అందించారు. కార్యక్రమంలో ఫారెస్టు సిబ్బంది పాల్గొన్నారు.

